ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : జి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 | సంచిక : 11 | జూలై 2022

## ఈ సంచికలో. . . .

వ్యాస పూర్ణిమ (గురు పూర్ణిమ) .................................. 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 5

గురుదర్శనం ........................................................ 24

అక్షరమణమాల ..................................................... 26

ఇతర విషయములు :

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం

### గురు ధ్యానం

దక్షిణామూర్తి సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।
అస్మదాచార్య పర్యంతాం వన్దే గురు పరంపరామ్ ॥

### ది॥ 13-07-2022 గురుపౌర్ణమి సందర్భంగా జిన్నూరు శ్రీ రమణక్షేత్రము నందు కార్యక్రమములు

- ఉ॥ గం॥ 6-00లకు పారాయణం
- ఉ॥ గం॥ 7-00లకు నెమలి వాహనంపై గిరి ప్రదక్షిణ, పూజా కార్యక్రమము
- ఉ॥ గం॥ 9-00లకు డా॥ ఉష గారి సత్సంగం
- ఉ॥ గం॥ 10-00లకు వైజాగ్ సుజాత గారి సత్సంగం
- ఉ॥ గం॥ 11-00ల నుండి అన్నప్రసాదం

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)


చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342



# వ్యాస పూర్ణిమ (గురు పూర్ణిమ)

నారాయణుడు, శివుడు, దక్షిణామూర్తి, వ్యాసుడు, శంకరాచార్యుడు. తరువాత మన గురువు. వందే గురు పరంపరామ్! గురు పరంపర అందరికీ నమస్కారాలు తెలియపరచుకోవటానికి ఈ గురు పూర్ణిమ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గురువు యొక్క అనుగ్రహం పొందటానికే ఈ గురుపూర్ణిమ మహోత్సవం. గురువు అనుగ్రహం లేకుండా, గురువు యొక్క దయ లేకుండా మనకి స్వరూప జ్ఞానం కలుగదు.

వ్యాసో నారాయణో హరిః! అంటే, నారాయణుడే వ్యాసుడిగా జన్మించాడని మన సాంప్రదాయం చెపుతోంది. తేడా ఏమిటంటే, నారాయణుడికి నాలుగు చేతులు, వ్యాసుడికి రెండు చేతులు. చేతులే తేడా కానీ, ఆయన సాక్షాత్తు నారాయణుడే! వ్యాసుడు ఆషాడశుద్ధపూర్ణిమ రోజున అవతరించాడు భూమిమీద. అందుచేత ఆషాడపూర్ణిమనే వ్యాసపూర్ణిమ అంటారు. వ్యాసపూర్ణిమ అంటే శ్రీరామనవమి లాగ, కృష్ణాష్టమి లాగ, వ్యాసుడు భూమి మీద అవతరించిన రోజు. ఆ వ్యాసపూర్ణిమనే గురుపూర్ణిమగా మనవాళ్లు సాంప్రదాయంలో చేసుకొంటున్నారు. ఈరోజున, ఎవరి గురువుని వారు ఆరాధించుకోవటం సాంప్రదాయం. భారతదేశంలో 5000 సంవత్సరాల నుంచి ఈ వ్యాసపూర్ణిమ ఉత్సవం జరుగుతోంది.

వ్యాసుడికి చాలా పేరులు ఉన్నాయి. అసలు పేరు కృష్ణద్వైపాయనుడు. బదరికాశ్రమములో కొంతకాలం తపస్సు చేశాడు కాబట్టి బాదరాయణుడు అంటారు. కానీ ఆయనకి ప్రసిద్ధి పొందిన పేరు వేదవ్యాసుడు. వేదాలని విభజించాడు కాబట్టి ఆయనకి ఆ పేరు వచ్చింది. వేదవ్యాసుడు భూమి మీదకు రాకముందు వేదాలు అన్నీ ఒక రాశి కింద ఉండేవి. వాటిని అందరూ అధ్యయనం చేయటం కష్టం. ఆ రాశిని నాలుగు భాగాలుగా విభజించాడు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అదర్వణవేదం.

మన భారతీయ సంస్కృతికి మూలం వాల్మీకి మహర్షి, వేదవ్యాస మహర్షి. భారతీయ నాగరికత అంతా కూడా వాళ్ళు ఇద్దరూ క్రియేట్ చేసిందే. వాల్మీకి రామాయణం, వ్యాసుడు భారతం రచించారు. పూర్వం మన సాహిత్యం అంతా మంత్రరూపంలోనే ఉంది. మంత్రాలు మనకి అర్థం అవ్వటం కష్టం. వాల్మీకి రామాయణాన్ని శ్లోక రూపంలో రచించాడు. దానిని

ఆదికావ్యం అని పిలుస్తారు. వ్యాసుడు నాలుగు వేదాల యొక్క సారం తీసుకొని, దానిని కథల రూపంలో మహాభారతం రచించాడు. అది లక్ష శ్లోకాల గ్రంధం. విష్ణుసహస్రనామాలు భగవద్గీత ఇవన్నీ భారతంలో భాగం. భారతం కూడా వేదం తోటి సమానమే, పంచమవేదం అంటారు. రామాయణం మహాభారతం, ఇవి రెండూ మహాకావ్యాలు. కొండలు ఎంతకాలం ఉంటాయో, ఈ నదులు ఎంతకాలం ప్రవహిస్తాయో, ఈ భూమి ఎంతకాలం ఉంటుందో అంతకాలం ఈ రెండు కావ్యాలు ఉంటాయి.

మహాభారతం యొక్క సృష్టి అద్భుతం. భారతంలో లేనిది ప్రపంచంలో ఎక్కడా లేదు, ప్రపంచంలో ఎక్కడా లేనిది భారతంలో ఉంది అని వ్యాసుడు చెప్పాడు. భారతంలో భగవద్గీతని ఇమిడ్చాడు కాబట్టి అది మహాభారతం అయ్యింది. భగవద్గీత చెప్పినవాడు నారాయణుడు, అది విన్నవాడు అర్జునుడు. రచన చేసి, దానిని శ్లోకబద్ధం చేసి ఒక క్రమంలో నియమించినవాడు వేదవ్యాసుడే. ప్రపంచంలో ఎంతమంది మనుషులు ఉన్నారో, అన్ని మనస్సులు ఉన్నాయి. ఒకరి మనస్సుకి, ఇంకొకరి మనస్సుకి సంబంధం లేదు. ఎవరి మనస్తత్త్వం వారిదే, ఎవరి పద్ధతి వాళ్ళదే, ఎవరి జీవలక్షణాలు వారివే. ప్రపంచంలో ఎన్ని మనస్తత్త్వాలు గల మనుషులు ఉన్నారో, అందరినీ మహాభారతంలో వ్యాసుడు చిత్రించాడు. ఏ మనిషి ప్రవర్తన ఎలా ఉంటుంది, ఇవన్నీ జాగ్రత్తగా పరిశీలించాలంటే మహాభారతం అందరూ చదవవలసిందే.

వేదాలలో ఉన్న మంత్రార్థం మనకి తెలియటం కష్టం. అందుచేత వేదాలలో సారాన్ని తీసి అష్టాదశపురాణాలు (18) రాశాడు. తరువాత ఆయన తెలుసుకున్న విద్యనంతా, చిన్న చిన్న సూత్రాల కింద బ్రహ్మసూత్రాలు రాశాడు. తరువాత భాగవతం రచన చేశాడు,విశాలమైన సాహిత్యం సృష్టించిన వాడు వేదవ్యాసుడు. ఆయన ఎక్కువ కాలం వ్యాసకాశిలో గంగానది ఒడ్డున కూర్చుని సాహిత్యం అంతా రాసుకొచ్చాడు.

వ్యాసుడు గురించి ఒక మాట చెపుతారు. జీవితంలో ఒక్కరోజు కూడా ఆయన వృధా చేసుకోలేదని. అంటే సాధనా భాగం అనండి, సాహిత్యం సృష్టి చేయనివ్వండి, లేకపోతే సమిష్టిగా దేశం గురించి ఆలోచించనివ్వండి, భారతదేశంలో ఎక్కువ సాహిత్యం సృష్టించిన వాడు ఆయన. జీవితంలో ఒక్కరోజు కూడా ఆయన దుర్వినియోగం చేసుకోలేదు, అలా కష్టపడితే అంత సాహిత్యం సృష్టించాడు వేదవ్యాసుడు. మనం ప్రతిరోజూ పాడు చేసుకొంటున్నాము. పోయిన డబ్బు మళ్ళీ సంపాదించుకోవచ్చును కానీ, పోయిన రోజులు మళ్ళీ రమ్మంటే రావు. అందుచేత మనం జాగ్రత్తగా ప్రతిరోజూ, ప్రతి గంట సద్వినియోగం

చేసుకోవాలి. సంవత్సరానికి 365 రోజులు అయితే ప్రతి రోజు ఒక అవకాశం మనం బాగుపడటానికి. ఈ ప్రపంచం గొడవలలోకి, అవసరం లేని గొడవలలోకి వెళ్లటంవల్ల మనకి కలసి వచ్చేది లేదు, పైగా మైండ్ పొల్యూట్ అవుతుంది. నీ మనస్సుని నువ్వు బాగు చేసుకోవటం కంటే మించిన పని నీకేమైనా ఉందా అని వాసుదేవస్వామివారు అడుగుతారు.

వ్యాసుడి తరువాత వచ్చినటువంటి పెద్ద ఆచార్యుడు ఆదిశంకరాచార్యులు. బుద్ధుడి తరువాత శంకరుడు, తరువాత రామానుజుడు, తరువాత మధ్వాచార్యులు వచ్చారు. అయితే ఈ ఆచార్యులకి బుద్ధుడికి ఒక తేడా ఉంది. శంకర, రామానుజ, మధ్వాచార్యులు ముగ్గురూ నూటికి నూరుపాళ్లు వేదాలని ప్రమాణంగా తీసుకున్నారు. మీ ఆలోచన, మీ మాట, మీ ప్రవర్తన, వేదాలకి అనుగుణంగా ఉందోలేదో చూస్తారు ఈ ఆచార్యత్రయం, లేకపోతే తీసి ఒకపక్కన పెట్టమంటారు. బుద్ధుడు వేదాలని ప్రమాణంగా తీసుకోలేదు, కానీ నాస్తికుడు ఏమీకాదు, నిర్వాణస్థితిని ఒప్పుకున్నాడు. భగవద్గీతకి ఆదిశంకారాచార్యులు వారు రాకముందు పెద్ద ప్రచారం లేదు. భారతంలో ఉన్న భగవద్గీతని బయటికి తీసి దానికి శబ్దానికి అర్థం చెప్పి భారతదేశం అంతా తిరిగి భగవద్గీతని మొట్టమొదట ప్రచారం చేసినవారు పరమాచార్యుడు, ఆదిశంకరాచార్యులు వారిని శివుడి అంశ అని చెపుతారు. వ్యాసుడు నారాయణుడి అంశ అని చెపుతారు.

వ్యాసభగవానుడు త్రిమూర్తి స్వరూపుడు. మన భారతదేశంలో వ్యాసుడు సృష్టించినంత సాహిత్యం ఇంక ఎవరూ చెప్పలేదు. కవిత్వం చూస్తే వాల్మీకి కవిత్వం చాలా మధురంగా ఉంటుందంటారు. వ్యాసుడు మన క్షేమం కోరాడు. మనకి కష్టసుఖాలు నేర్పాడు, మన తల్లితండ్రుల కంటే ఎక్కువ సహాయ సహకారములు వ్యాసుడు మనకి అందించాడు. ఆయన స్పోకెన్ ఎక్స్ప్రెషన్ ద్వారా, రిటెన్ ఎక్స్ప్రెషన్ ద్వారా మనకి చాలా మెస్సేజ్ ఇచ్చాడు వ్యాసుడు. వ్యాసుడి ఋణం మనం తీర్చుకోలేము.

**సూర్యుడు బయట చీకటిని పోగొడతాడు.**

**గురువు లోపల ఉన్న అజ్ఞానం అనే చీకటిని పోగొడతాడు.**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 09 సెప్టెంబర్ 1990, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవద్గీత, ఉపదేశ సారం ఇవి మీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా అనుదినం పారాయణం చేయవలసినటువంటి గ్రంథాలు. భగవద్గీతలో భగవంతుడు కృష్ణుడు టచ్చేయకుండా విడిచిపెట్టినటువంటి సమస్య లేదు. మీకు ఆధ్యాత్మిక మార్గంలో కాని, భౌతిక విషయంలో కాని, మీ కుటుంబ విషయాలలో కాని ఏ విషయంలో అయినా, ఏ కోణంలో అయినా మీకు సందేహం కలిగితే మీరు భగవద్గీత తీసి చూస్తే, ఇతరులను అడగక్కర్లేకుండా మీ సంశయానికి సమాధానం మీకు భగవద్గీతలో కనిపిస్తుంది. ఏడు వందల శ్లోకాలలో ఎక్కడో ఒక చోట మీ సంశయానికి సమాధానం దొరుకుతుంది. మీ మనసు చల్లబడిపోతుంది, మీ మనసు శాంతమైపోతుంది, మీ మనసు నెమ్మదైపోతుంది. అయితే మనం పుస్తకం చదివేటప్పుడు మనసును మూసేసుకుని చదవ కూడదు. మనం మనసును మూసేసుకుంటాం. మనసును మూసుకోకూడదు. ఎవరైనా పెద్దలు చెప్పేటప్పుడు మన మనసును విప్పి వినాలి. మనం ఇతరుల తోటి మాట్లాడినప్పుడు కూడా మనసును విప్పి మాట్లాడాలి. మన మనసును ఓపెన్ చేస్తే భగవంతుడు తన హృదయాన్ని కూడా మనకి ఇస్తాడు. భగవద్గీతను మీరు చదివేకొలది దాని రుచి మీకు తెలుస్తుంది. దాని అంతస్తు తెలుస్తుంది. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మీరు గీత చదవండి. ఇష్టమైన పనులు మీరు చేస్తారు, నేను చేస్తాను, అందరూ చేస్తారు. మనకు ఇష్టం ఉన్నా, మనకు ఇష్టం లేకపోయినా మన ఇష్టాన్ని, అయిష్టాన్ని మూట కట్టి ఒక పక్కన పెట్టి, మన అహంకారం తోటి మన మమకారం తోటి సంబంధం లేకుండా, భగవంతుడు చెప్పిన మాటలను మనం హృదయపూర్వకంగా తీసుకుని ఆచరిస్తే అది మనకు అనుభవంలోకి వస్తుంది. అప్పుడు అద్వైత ఆనందాన్ని, ఆత్మ ఆనందాన్ని, మోక్ష సుఖాన్ని, ఈ శరీరంలో ఉండగానే మనం పొందవచ్చు. ఇంతవరకు మనకు ఇంద్రియ ఆనందం ఎలా ఉంటుందో అందరికి తెలుసు. ఇంద్రియాలకు సంబంధించిన ఆనందం ఎలా ఉంటుందో మనం భగవద్గీత చదవక్కరలేదు అందరికి తెలుసు. అయితే ఆత్మ ఆనందం ఎలా ఉంటుందో, మోక్ష ఆనందం ఎలా ఉంటుందో, అద్వైత ఆనందం ఎలా ఉంటుందో, మనకి తెలియదు. భగవద్గీత చదివి అది

మనం అర్థం చేసుకుని, మనం జీర్ణం చేసుకుని, ఆచరిస్తే ఆ సుఖం అనేది నిజంగా ఎలా ఉంటుందో మనకు తెలుస్తుంది.

**కర్తు రాజ్ఞయా ప్రాప్యతే ఫలం, కర్మ కింపరం కర్మ తజ్జడం.**

**కృతి మహోదధౌ పతనకారణం, ఫల మశాశ్వతం గతి నిరోధకం.**

**ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం, చిత్త శోధకం ముక్తి సాధకం.**

ఇవి ఉపదేశసారంలో మొట్ట మొదటి మూడు శ్లోకాలు. భగవాన్ ఏమి చేశారంటే సాంప్రదాయకంగా మన భారత దేశంలో వస్తున్నటువంటి కర్మ యోగం, భక్తి యోగం, ఈ యోగాలు అన్నిటిని మొదటి పదిహేను శ్లోకాలలో చెప్పారు. పూర్వం మన ఋషులు దగ్గర నుంచి మన వేద కాలాల నుండి వచ్చిన సంప్రదాయాలని ఉపదేశసారంలోని మొట్టమొదటి పదిహేను శ్లోకాల్లో చెప్పారు. చివరి పదిహేను శ్లోకాలలో ఏమి చేశారంటే ఆయన హృదయాన్ని అంటే ఆయన పొందినటువంటి అనుభవాన్ని, ఆత్మవిద్యని, ఆయన హృదయం లోంచి తీసి చివరి పదిహేను శ్లోకాలలో చెప్పారు. ఆయన ఈ భూమి మీదకి ఏ విద్యను గురించి అయితే మనకు చెప్పటానికి వచ్చారో, దాని గురించి చివరి పదిహేను శ్లోకాలలో ఆయన ఎంతగానో వివరించారు. ఎవరైనా మాకు ఉపదేశం చెబుతారా అని భగవాన్‌తో అంటే, ఉపదేశం ఉపదేశసారంలో ఉంది అని చెప్పేవారు. మీరు ఆధ్యాత్మిక లోయలలోకి దిగాలంటే, ఆధ్యాత్మిక శాంతిని అనుభవించాలి అంటే, ఈ జనన మరణాలకి అతీతమైన సుఖం మీరు తెలుసుకోవాలి అంటే కేవలం ఎవరో పూజారులు చెప్పే, ధర్మ శాస్త్రాలు చెప్పే మాటలు గురించే సంతృప్తి పడవద్దు. స్వర్గ రాజ్యం, పరలోక రాజ్యం, మోక్ష రాజ్యం, నిర్వాణ స్థితి మీ హృదయంలోనే ఉంది, ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది, దీనిని మీరు మీ చేతుల తోటి మూసేసుకోవద్దు. మీ మనసు తోటి మూసేసుకోవద్దు. ఏదో ధర్మం అని, అధర్మం అని ఎవరో చెప్పిన మాటలు విని డైరెక్ట్‌గా మీకు ఉన్నటువంటి, మీ హృదయంలో ఉన్న దేవాలయాన్ని మీరు మూసేసుకోవద్దు. కేవలం ధర్మ శాస్త్రాన్ని చిలక పలుకులు క్రింద పలికే వాడిని దృష్టిలో పెట్టుకుని, పుణ్యానికి, పాపానికి, రాగానికి, ద్వేషానికి, ద్వంద్వాలకి అతీతంగా మీ హృదయంలో ఉన్న ఈ స్వర్గ రాజ్యం, ఈ మోక్ష రాజ్యం, ఈ నిర్వాణ స్థితి, ఈ వైకుంఠ స్థితిని నీ చేతుల తోటి నువ్వు మూసుకుంటావు ఎందుకు? అందుకే నీ స్వరూపమైన సుఖానికి నువ్వు దూరం అయిపోతున్నావు. మనం ఎవడైతే దేవుడు అనుకుంటున్నామో, ఏదైతే ప్రకృతి, పంచ భూతాలు, జీవుడు, సూర్యుడు, చంద్రుడు ఇదంతా అనుకుంటున్నామో,

ఏద్వైతే జన్మలు, పునర్జన్మలు, పర లోకాలు, స్వర్గ రాజ్యాలు, నరక రాజ్యాలు, ఇవన్నీ అనుకుంటున్నామో, నేను చెప్పినవి సమస్తం అన్నింటిని కూడా మింగేసే శక్తి మీ హృదయానికి ఉంది అన్న సంగతి మీకు ఎప్పుడు తెలుస్తుంది?

నదుల్లో ఉన్న నీళ్ళు అంతా వెళ్లి సముద్రంలో ఏ విధంగా అయితే లయం అయిపోతున్నాయో, ఆత్మశాంతి కనుక తెలిస్తే ఈ జగత్తే కాదు, జీవుడే కాదు, అహంకారమే కాదు, నువ్వు అనుకునే దేవుడు కూడా ఈ హృదయంలో లయం అయిపోతాడు. మంచి అని, చెడు అని, పునర్జన్మలని, ఎవరో కల్పించి చెప్పిన విషయాలు గురించి ఎందుకు నువ్వు నీ హృదయంలో ఉన్న స్వర్గరాజ్యానికి దూరం అయిపోతున్నావు. నువ్వు కర్మ చేస్తున్నావు. సాత్విక కర్మ చెయ్యి. ఇప్పుడు మనకు ఉన్న రాజ్యాంగం గురించే మనం ఆలోచిస్తూ ఉంటాం. దేవుడి రాజ్యాంగం కూడా ఒకటి ఉందన్న సంగతి మనం మర్చిపోయాం. వాడు కర్త, వాడు ప్రభువు, వాడి యొక్క ప్లాన్ ప్రకారం ఈ సృష్టి నడుస్తుంది. అది మీ కళ్ళకి కనిపించక పోవచ్చు. మీ మెదడుకి అందక పోవచ్చు. కాని దేవుని చట్టం ప్రకారమే, దేవుని ఆజ్ఞ ప్రకారమే అంతా జరుగుతుంది. దేవుని యొక్క ఆజ్ఞని ఉల్లంఘించడానికి వీలు లేదు. కర్తు రాజ్ఞయా ప్రాప్యతే ఫలం అందుచేత నువ్వు ఏ పని చేసినా నువ్వు చేసే పనిని బట్టి రాదు దాని ఫలితం, దానిని నిర్ణయించే వాడు, దాని result ఇచ్చేవాడు, కేవలం ఈశ్వరుడు మాత్రమే. ఆయన స్వతంత్రుడు, నువ్వు స్వతంత్రుడివి కాదు. నువ్వు చేసే పని జఢం అందుచేత ఈశ్వరుడి యందు గౌరవం ఉంచు. ఈశ్వరుడికి సమర్పణ అయ్యి నువ్వు కనుక పని చేస్తుంటే, నువ్వు ఆశించినా, ఆశించక పోయినా, ఆయన ప్రణాళిక ప్రకారం, ఆయన రాజ్యాంగం ప్రకారం, నీ కోటా నీకు వచ్చేస్తుంది. మనం చేస్తున్న పనికి గుర్తింపు కోరుతున్నాం అంటే అందులో నా కోరిక ఉంది అన్నమాట. Personal desire. అంటే నా కోరిక ఏమి చేస్తుంది? నా మనసుని పాడు చేస్తుంది. కనీసం అందరి చేతనేను గుర్తించబడాలి అన్న భావన నాకు ఉన్నప్పటికీ, అది సకామ కర్మే, అది కోరిక తోటి చేసే కర్మే. అది నిష్కామ కర్మ కాదు. కోరికతోటి నువ్వు పని చేశావా దానికి ఫలితం వస్తుంది. మంచికి మంచి వస్తుంది. చెడుకి చెడు వస్తుంది. కోరిక లేకుండా చేస్తే నీకు ఫలితం రాదేమో అని నువ్వు అనుకోకు. కోరిక లేకుండా పని చేసినా నీకు ఫలితం వస్తుంది. అయితే అదనంగా నీకు లాభం ఏమిటంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. నీ మనసు బాగు పడుతుంది. నీ మనసు నిర్మలం అవుతుంది. ఎప్పుడైతే మనసు నిర్మలం అయ్యిందో పరలోకరాజ్యం అంటారు

చూసారా, అది మనకి తెలియకుండానే, మన ఊహల తోటి సంబంధం లేకుండానే, నీ హృదయంలో ఒక్కసారి వ్యక్తం అవుతుంది. భగవద్గీతలో ఒక మాట చెప్పారు. స్వార్థపరుడు, తన స్వార్థం కోసం ఎంత కష్టపడి పని చేస్తాడో, సజ్జనుడు లోకసంగ్రహం కోసం అంత కష్టపడి పని చేస్తాడు. బాహ్యానికి చూస్తే ఇద్దరిది సమానమైన పని. ఒకడికి మోక్షం వస్తుంది, రెండోవాడు అంటే స్వార్థపరుడు - బంధంలో పడతాడు, పునర్జన్మలో పడతాడు, కర్మ సముద్రంలో పడతాడు. ఇక్కడ ఒక చిన్న విషయం. పని చేసేటప్పుడు మనం అందరం కూడా ఫలితం గురించి ఆశిస్తాం. ఫలితం గురించి ఆశించకపోతే ఫలితం రాదు అని మన ఉద్దేశం. ఇదే ఇక్కడ చెబుతున్నాడు. కర్తు రాజ్ఞయా నువ్వు ఆశించినా, ఆశించక పోయినా, ఆయన రాజ్యాంగాన్ని బట్టి, ఆయన ప్రణాళిక బట్టి అది వచ్చేస్తుంది. కాని రాదేమో అని నువ్వు కంగారు పడుతున్నావు. అదే కర్తు రాజ్ఞయా దేవుని రాజ్యాంగాన్ని ఎవరు ఉల్లంఘించలేరు.

మనం పని చేస్తాం, పని చేస్తే ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని అనుభవిస్తాం. ఆ ఫలితాన్ని భోగిస్తాం. భోగించినప్పుడు ఒక వాసన పుడుతుంది. ఆ వాసనను అనుసరించి మళ్ళీ పని చేస్తాం. ఇదే కర్మ సముద్రం, ఇందులోంచి నువ్వు బయటకి రాలేవు. సముద్రాన్ని cross చెయ్యటం ఎంత కష్టమో, ఈ కర్మసముద్రం నుండి జీవుడు బయటకు రావడం కూడా అంతే కష్టం. ఈ కర్మసముద్రంలో పడ్డవాడికి అసలు గతే రాదు. ఎంతసేపు బాహ్యమైన మాటలు చెబితే వింటా ఉంటాడు కాని, ఈ కర్మసముద్రంలో ఉన్న మనిషి, పరలోకరాజ్యాన్ని మూసేసుకుంటాడు. పరలోకరాజ్యం గురించి ఎవరైనా చెప్పినా వాడి చెవులు వినవు. వాడి కళ్ళు చూడవు. గుడి కట్టించండి పుణ్యం వస్తుంది. సంతర్పణ చేయండి పుణ్యం వస్తుంది. అంటే ఇటువంటి మాటలు వింటారు, గతి గురించి చెబితే వినడు, మోక్షం



**సూర్యుడు బయట చీకటిని పోగొడతాడు.**

**గురువు లోపల ఉన్న అజ్ఞానం అనే చీకటిని పోగొడతాడు.**

గురించి చెబితే వాడు వినడు, ఎందుచేత? మోక్షం అనే గుర్తింపే వాడికి రాదు. మోక్షం యొక్క వైభవం వాడికి తెలియదు. మోక్ష సుఖం ఎలా ఉంటుందో తెలియదు. ఈ కర్మ సముద్రంలో పడ్డ మనిషి, పరలోకరాజ్యం వైపుకి వాడు ముఖమే తిప్పడు. జనన మరణాలకు అతీతమైనటువంటి శాశ్వత జీవితాన్ని గురించి ఎవరైనా చెప్పినా ఆ మాటలు వాడికి రుచించవు. అందుచేత నువ్వు శాస్త్రాన్ని శ్రవణం చేసి గమ్యాన్ని మటుకు ఆత్మ వైపుకే పెట్టుకో, జన్మ గురించి కాని, పునర్జన్మ గురించి కాని, లేకపోతే ఇతర లోకాలలో ప్రయాణాలు గురించి కాని, భగవాన్ చెప్పేవారు కాదు. ఒకసారి గణపతిశాస్త్రి గారు భగవాన్ ని అడిగారు. ఎప్పుడుచూసినా మీరు ఆత్మ గురించే చెబుతున్నారు. అది తప్పించి, ఇంకొక విషయం గురించి ఎప్పుడూ మీరు మాట్లాడరు ఏమిటి అని అడిగితే అప్పుడు భగవాన్ అన్నారు. ఉన్నది అదే. అందుచేత దాని గురించి చెబుతున్నాను. అది తప్పించి నేను ఏమి చెప్పినా అబద్ధం చెప్పినట్టు అవుతుంది. మరి నా నోటితోటి అబద్ధాలు చెప్పి, ఏవండీ, ఇంతవరకు మీకు చెప్పినవి అన్నీ అబద్ధాలు, ఇవన్నీ మర్చిపోండి. ఇప్పుడు నిజం చెబుతున్నాను అని ఆత్మ గురించి చెప్పమంటారా? ఎదుటి మనిషికి రాగానే నిజం చెప్పమంటారా? లేక అబద్ధం చెప్పమంటారా అన్నారు. మనకు స్వప్నం అబద్ధం, జాగ్రత్తు నిజం. భగవాన్‌కి ఏమిటి? స్వప్నం ఎంత అబద్ధమో, జాగ్రదావస్థ కూడా అంతే అబద్ధం భగవాన్‌కి. స్వప్న అవస్థ ఎంత అసత్యమో, జాగ్రదావస్థ కూడా అంతే అసత్యం. కృతి మహోదధౌ పతన కారణం, ఫలం అశాశ్వతం గతి నిరోధకం. ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం, చిత్త శోధకం, ముక్తి సాధకం. నీ మనసుని ఎంతసేపు ఆత్మ యందే పెట్టుకో. ఆత్మనే మననం చెయ్యి. మనం విషయాలను మననం చేస్తున్నాం ఆత్మను పొందాలి అనుకుంటున్నాం. నువ్వు నిరంతరం ఆత్మనే మననం చెయ్యి. నిరంతరం ఆత్మని మననం చేయగా, చేయగా, ఆ స్వరూపం పొందుతావు. నువ్వు ఆత్మను పొందుతావు. అది అవుతావు. ఆత్మను సంపాదించటం అంటే ఆత్మగా ఉండటం. ఆత్మగా అవ్వటం. అందుచేత ఆత్మలో నువ్వు నిలబడగలగాలి అంటే, నీ మనసు అంతర్ముఖం కావాలి. నీ మనసు పల్చబడాలి. నీ మనసు కోరిక లోంచి, వాసన లోంచి విడుదల పొందాలి. పరమేశ్వరుణ్ణి కాని, ఆత్మని కాని, నిరంతరం చింతించాలి అంటే భావనాబలం ఉండాలి. భావనాబలం లేని వాడు నిరంతరం చింతించలేడు. భావనాబలం ఏ మనిషికి అయితే లేదో, వాడు నిరంతరం ఈశ్వరుణ్ణి కాని, ఆత్మని కాని, చింతించలేడు. కొంతమంది గౌరవం కోరి పని చేస్తూ ఉంటారు. గౌరవాన్ని కోరడం ఎటువంటిదో, నాకు అగౌరవం

రాకూడదు అనుకోవడం కూడా అటువంటిదే. ఇది కూడా వాడు కర్మ సముద్రంలో పడ్డట్టే.

అందుచేత కించిత్తు కూడా ఇతర విషయాల మీదకి వెళ్ళకుండా, ఎవడైతే నిరంతరం ఆత్మను చింతిస్తున్నాడో, వాడు నిజమైన భక్తుడు. అయితే నువ్వు ఆత్మను చింతిస్తుంటే, దేవుని చింతిస్తుంటే, నీ కోరికలు నెరవేరవేమో అని నీకు భయం. అదే భగవాన్ చెప్పారు అలా భయం నీకు అక్కర్లేదు. నీ అహంకారానికి శక్తి లేదు. నీ జీవుడికి శక్తి లేదు. శక్తి నీది కాదు శక్తి పరమేశ్వరుడిది. శారద మాత ఏమి చెప్పారు అంటే మీకు తెలివి ఉంటే మంచిదే. మీకు ప్రతిభ ఉంటే మంచిదే. అయితే ఆ ప్రతిభ తోటి నువ్వు జ్ఞానాన్ని సంపాదించటానికి ప్రయత్నం చెయ్యి. అంతేగాని ఈ ప్రతిభ పేరు చెప్పి, కులానికి కులానికి మధ్య, మతానికి మతానికి మధ్య నువ్వు బేధాన్ని పెంచుతుంటే అది ప్రతిభ ఎలా అవుతుంది? నువ్వు ఒక badmanని goodmanని చెయ్యి, ఓ goodman ని ఇంకా betterman ని చెయ్యి, ఆ bettermanని bestmanని చెయ్యి. అది ప్రతిభ అంటే అంతే కాని కేవలం నీ తెలివి తేటలు ఉపయోగించి మనిషికి, మనిషికి దూరం పెంచటం అది ప్రతిభ కాదు. అరుణాచలం చూడటానికి వచ్చిన వాడు ఎవడు వట్టి చేతుల తోటి బయటకి వెళ్ళడు. నాస్తికుడు ఆస్తికుడు అవుతాడు. ఆస్తికుడు భక్తుడు అవుతాడు. భక్తుడు జ్ఞాని అవుతాడు. కాని ఒక్కడు కూడా వట్టి చేతుల తోటి ఈ క్షేత్రంలోంచి బయటకి వెళ్ళడు అని భగవాన్ చెప్పారు. ప్రాణాయామాలు చేస్తున్నాం, ఎంతో కష్టపడుతున్నాం, మరి ఇంత కష్టపడి సాధన చేస్తున్నప్పుడు మాకు మోక్షం రాకపోతే ఊరికే అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచల శివ, అని స్మరణ చేస్తేనే మోక్షం వచ్చేస్తుందా అని భగవాన్‌ని అడిగారు. భగవాన్ ఏమి చెప్పారంటే ఇది భీమవరం కోర్టు తీర్పు కాదు. ఏలూరు కోర్టు తీర్పు కాదు. హైకోర్టు తీర్పు కాదు. ఇది సుప్రీంకోర్టు తీర్పు. ఇది శివుడి తీర్పు. ఇది finalword. భీమవరం కోర్టులో తీర్పు చెబితే, నువ్వు ఏలూరు వెళతావు అప్పీలు చేసుకోవటానికి, ఏలూరు కోర్టులో తీర్పు చెబితే అప్పీలు చేసుకోవడానికి హైకోర్టుకు వెళతావు. హైకోర్టులో నీ కేసు ఫెయిల్ అయితే సుప్రీంకోర్టుకి వెళతావు. సుప్రీంకోర్టులో నీ కేసు ఫెయిల్ అయితే ఎక్కడకు వెళతావు? అది final. భగవంతుడు చెప్పిన మాట సుప్రీంకోర్టు. దానికి తిరుగు లేదు. దానికి అప్పీలు లేదు. అది ఈశ్వరుని యొక్క ఆజ్ఞ. అది సుప్రీంకోర్టు రూలింగ్. నీకు, దేవుడికి, పంచభూతాలకి, సూర్యుడికి, చంద్రుడికి, ఈ సమస్త జగత్తుకి, ఏ వస్తువు అయితే ఆధారంగా ఉందో, అదే నువ్వు అయి ఉన్నావు. నీ లోపల ఉన్న ఆ వస్తువును పట్టుకోవడం మానేసి ఎందుకయ్యా ఈ పూర్వజన్మ, పరజన్మ ఏమిటి? లాభము, నష్టము,

కష్టము, సుఖము, రాగము, ద్వేషము, ఎందుకు అయ్యా ఈ చిల్లర గొడవలు పట్టుకుని ఆ ప్రవాహంలో కొట్టుకుపోతావు. ధర్మం చేశావు మంచిదే పుణ్యం వస్తుంది అనుభవిస్తావు. లేకపోతే పాపం చేశావు నువ్వు చెడ్డ ఫలితాన్ని అనుభవిస్తావు. నువ్వు నరకానికి పోతావు అక్కడ కొంతకాలం అనుభవిస్తావు. అది శాశ్వతం కాదు. ఇది శాశ్వతం కాదు. అది నిత్యం కాదు, ఇది నిత్యం కాదు. ఏదైతే ఈ జగత్తుకి ఆధారంగా ఉందో, ఏదైతే జీవుడికి ఆధారంగా ఉందో, మీకే కాదు, ఈ జగత్తుకే కాదు, ఈ పంచ భూతాలకేకాదు, ఈ సూర్యుడికే కాదు, ఈ చంద్రుడికే కాదు, దేవుడికి కూడా ఏ వస్తువు అయితే ఆధారంగా ఉందో, ఆ వస్తువే నువ్వు అయినప్పుడు, దాన్ని తెలుసుకోవడం వదిలేసి, సూటిగా దాన్ని ఫేస్ చేయడం మానేసి, దాన్ని అన్వేషించటం మానేసి, దాన్ని వెతకటం మానేసి, అందులోకి దిగటం మానేసి, ప్రలోభాలకు లోను కాకుండా దూసుకొనిపోయి సరాసరి ఆత్మను పట్టుకోవడం మానేసి, ఈ జన్మ ఏమిటి? ఆ పూర్వ జన్మ ఏమిటి? నేను చనిపోయిన తరువాత ఏమి అవుతాను. ఎందుకొచ్చిన ఈ చిల్లర గొడవలు? ఎందుకు జన్మను ఇలా నువ్వు పాడు చేసుకుంటావు? ఎందుకు నీ కాలాన్ని ఇలా పాడుచేసుకుంటావు. పూర్వజన్మ గొడవ ఎందుకు? పరజన్మ గొడవ ఎందుకు? అసలు ఈ జన్మ ఒకటి నిజం అయితే పరజన్మ నిజమే. ఈ జన్మ ఒకటి నిజం అయితే పూర్వ జన్మ నిజమే. ఇదే నిజం కానప్పుడు అవి నిజం ఎలా అవుతాయి? నాకు పూర్వజన్మ గురించి తెలుసుకోవాలని ఉంది చెబుతారా అని ఒకరు భగవాన్‌ని అడిగారు? నిజంగానే చెబుతాను. ఈ జన్మలోని దుఃఖమే నువ్వు భరించలేక పోతున్నావు. పూర్వజన్మలో విషయాలు నీకు జ్ఞాపకం వస్తే ఆ దుఃఖాన్ని కూడా మోయగలవా నువ్వు? ప్రాణ ప్రయాణ టైములో ఆ జీవుడు ఎక్కడికి వెళతాడో జ్ఞానికి తెలుస్తుంది అని గీతలో భగవంతుడు చెప్పాడు. పూర్వజన్మ గురించి చెబుతాను నీకు, ఏమిటి నీకు కలిసి వచ్చేది? భగవంతుడు ఒక మాట చెప్పాడండి, నీకు ప్రాణ ప్రయాణ టైములో ఏ దృశ్యం అయితే నీ మనసులో వస్తుందో దానిని బట్టే మరుసటి జన్మ వస్తుంది, నీకు ఆ గుర్తు పోదు.

భగవంతుడి యొక్క స్మరణ తోటి మీరు ఉంటే నన్ను స్మరించుకుంటూ ఉంటే మంచిజన్మ వస్తుందని భగవంతుడు చెప్పాడు. భగవాన్ ఏమి అంటున్నాడు అంటే, వ్యవసాయదారుడేమో వ్యవసాయ విషయాల గురించి స్మరిస్తూ ఉంటాడు. సైన్సు గురించి ఆలోచించేవాడు సైంటిస్ట్ అవ్వచ్చు. అలాగే భగవంతుడి గురించి స్మరించే వాడికి మంచి ఆధ్యాత్మిక వికాసం పొందే జన్మ రావచ్చు. కాని భగవంతుడి గురించి స్మరించే ఈ నేను

ఎవడు? వ్యవసాయం గురించి స్మరించే ఈ నేను ఎవడు? ఈ సైన్సు గురించి స్మరించే ఈ నేను ఎవడు? అందరూ దేవుడిని చూడాలి, దేవుడిని చూడాలి అని చెప్పేవాళ్ళే. కాని దేవుడిని చూడాలనే ఈ నేను ఎవడు? ఈ విచారణ చేసేవాడు ఒక్కడు కనిపించటం లేదు. ఈ నేనే ప్రకృతిని కల్పించింది. ఈ నేనే ఇంద్రియాలని కల్పించింది. ఈ నేనే మనసుని కల్పించింది. ఈ నేనే దేవుడిని కూడా కల్పిస్తోంది. నేను ఉంటే అంతా ఉంది. అది లేకపోతే ఏది లేదు. మీకు తలంపు వచ్చిన తరువాత దేవుని సమస్య వస్తోందా? లేక తలంపు లేనప్పుడు కూడా మీకు దేవుని సమస్య ఉందా? మీకు తలంపు లేనప్పుడు దేవుని సమస్య లేదు. తలంపు లేనప్పుడు జన్మ సమస్య లేదు. తలంపు లేనప్పుడు మోక్షం సమస్య లేదు. తలంపు లేనప్పుడు స్వర్గం, నరకం, ద్వైతం అనే సమస్య లేనే లేదు. తలంపు లేనప్పుడు కామం లేదు. తలంపు లేనప్పుడు రాగం లేదు. తలంపు లేనప్పుడు ద్వేషం లేదు. నేను అనే సమస్యను పరిష్కరించుకోలేక నువ్వు కాని విషయాల మీద నువ్వు ఆసక్తి పెంచుకుంటున్నావు. నువ్వు ఏదైతే కాదో దాని మీద ఆసక్తిని నువ్వు ఎందుకు పెంచుకుంటున్నావు? ఇలా నువ్వు ఎంత దూరం అయితే పెంచుకుంటూ వెళ్తున్నావో అంత దూరం మళ్ళీ వెనక్కి రావాల్సిందే. ఈ శరీరంలో ఉండగా సత్యాన్ని తెలుసుకుంటే, ఉన్న వస్తువుని తెలుసుకుంటే, అప్పుడు నువ్వు ఆత్మ లాభం పొందుతావు, ఆత్మ సుఖాన్ని పొందుతావు. ఏ లాభం పొందిన తరువాత దానికి మించిన లాభం లేదని తెలుస్తుందో, ఏ శాంతిని పొందిన తరువాత దానికి మించిన శాంతి లేదని తెలుస్తుందో అదే ఆత్మ లాభం. అదే ఆత్మ శాంతి అని పరమాత్మ చెప్పాడు. దానిని పొందటానికి ఈ దేహంలో ఉండగా ప్రయత్నం చెయ్యి. దేహంలో ఉండగా ప్రయత్నం చేయడం మానేసి, మరణించిన తరువాత నేను ఏమవుతాను అని ఆలోచిస్తూ ఉంటే, ఏదోకటి అవుతావు. ఈశ్వరఆజ్ఞని బట్టి, కర్మాను సారంగా ఏదోక దేహం వస్తుంది. ఆ దేహం కొంతకాలం ఉంటుంది, పడిపోతుంది. మళ్ళీ ఇంకో దేహం కొంతకాలం ఉంటుంది, పడిపోతుంది. ఇవన్నీ స్వప్నం మాత్రమే. అయితే

**బయట గురురూపంలో ఉన్నవాడు, లోపల గురురూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. బయట నుండి నీ మనస్సుని లోపలకు గెంటేవాడు, హృదయాభిముఖంగా నీ మనస్సును త్రిప్పేవాడు గురువే. సమస్తం గురువే!**



నిద్రలో వచ్చేది పొట్టి కల, ఇది పొడుగు కల అన్నారు భగవాన్. కల ఎప్పుడు వస్తుంది? మనకి నిద్రలో కల వస్తుంది. మరి ఇప్పుడు మనం నిద్రలో ఉన్నామా? ఇదీ నిద్రే. అజ్ఞానం అనే గాఢనిద్ర. మోహం అనే గాఢనిద్ర. అజ్ఞానంలోనే నువ్వు మరణిస్తున్నావు. మళ్ళీ అజ్ఞానంలోనే జన్మిస్తున్నావు. ఇప్పుడు అజ్ఞానం అనే నిద్రట్లో ఉన్నాం. మరి నీకు మెలకువ ఎప్పుడు వస్తుంది? ఉన్న వస్తువు ఉన్నట్టుగా నీకు తెలిసే వరకు నీకు ఇదంతా నిజంగానే కనిపిస్తుంది. నీ హృదయంలో ఉన్నటువంటి సత్యధార్థం నీకు అనుభవంలోకి వచ్చే వరకూ, అది నీకు తెలిసే వరకూ, నీకు ఉన్న వస్తువు ఉన్నట్టు నీకు తెలిసే వరకూ లేనిది ఉన్నట్టుగా కనిపిస్తూ ఉంటుంది. మరి లేనిది లేనట్టు ఎప్పుడు తెలుస్తుంది? నీకు ఉన్న వస్తువు ఉన్నట్టు తెలిస్తే లేనిది లేనట్టుగా తెలుస్తుంది. నీ హృదయంలోని వస్తువు నీకు తెలిసే వరకు ప్రపంచం నిజం అనిపిస్తుంది. జన్మ నిజం అనిపిస్తుంది. పునర్జన్మ నిజం అనిపిస్తుంది. కర్మ సిద్ధాంతం నిజం అనిపిస్తుంది. కర్తృత్వం నిజం అనిపిస్తుంది. ఈ సమస్తం, ఈ లాభనష్టాలు, కష్టసుఖాలు, ఈ ద్వైత ప్రపంచం అంతా కూడా నిజం అనిపిస్తూ ఉంటుంది. ఎంతకాలం? నువ్వు అజ్ఞానంలో ఉన్నంతకాలం, భగవాన్ ఎంత స్పష్టంగా చెప్పారు అంటే గాఢనిద్రలో మన శరీరం మంచం మీద ఉంటుంది, ఇంకో దేహాన్ని కల్పించుకుని ఈ మనసు మద్రాసు వెళుతుంది. ఈ దేహం మంచం మీదే ఉంటుంది. కాని మద్రాసు వెళ్ళే దేహం ఈ దేహం కాదు. మనసు కల్పించినటువంటి దేహం మద్రాసు వెళ్ళి వచ్చింది. నీకు మెలకువ వచ్చిన తరువాత ఆ మద్రాసు వెళ్ళిన దేహం గురించి, దానికి లాడ్జి దొరికిందా లేదా అది అన్నం తిందో లేదో అని ఆ దేహం కోసం నువ్వు వెతుకుతూ కుర్చుంటావా అని అడిగారు. దానికోసం ఎవరు వెతుకుతారు అండి అది అబద్ధం అని నాకు తెలిసిపోయింది కదా అన్నాడు. అది అబద్ధం అని అర్థం అయిపోయింది అనుకోండి, ఇంక ఆ దేహం చుట్టూ ఎవడు తిరుగుతాడు? ఆ దేహం ఎంత అబద్ధమో, ఈ దేహం కూడా అంతే అబద్ధం. మీ హృదయంలోని శాంతి, మీ హృదయంలో ఉన్నటువంటి ఆనందం, ఆ మాధుర్యం, మీకు అందినప్పుడు ఈ సృష్టిని create చేసినటువంటి creator వచ్చి మీ ముందు నిలబడ్డా అతని వంక మీకు చూడాలి అనిపించదు. అటువంటిది ఆత్మ. సాధన, సాధన అంటే ఈ వేదాంత పరిభాషలో చెప్పే మాటలు చూసి ఎవరు మీ మనసుని పుండు చేసుకోకండి. మాములుగా నాకు ఏదో తలంపు ఉంటుంది, ఏదో కోరిక ఉంటుంది, ఏదో వాసన ఉంటుంది. నా వాసనని నేను అస్తమాను repeat చేసుకుంటూ ఉంటాను. నాకు ఏదో వాసన ఉంది, అది

చెడ్డ వాసనో, మంచి వాసనో, చెడ్డ కోరికో, మంచి కోరికో, నా కోరికనే నేను ప్రాక్టీసు చేసుకుంటూ ఉంటాను. నా కోరికను నెరవేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తాను. అప్పుడు నేను ప్రాపంచిక మానవుడిని అవుతాను. అంటే వాడికి ఏ కోరిక అయితే ఉందో ఆ కోరికను నెరవేర్చుకోవటం కోసం, దాన్ని బలపర్చుకోవటం కోసం వాడు ప్రయత్నం చేసుకుంటాడు. వాడిని లౌకికుడు అంటారు. వాడికి దేవుడు అక్కర్లేదు. పరలోకం అక్కర్లేదు. అందుచేత కృష్ణుడు ఏమని చెప్పాడు అంటే తపస్సు ఏ మనిషికి అయితే లేదో వాడికి ఆత్మజ్ఞానం గురించి, ఆత్మవిద్య గురించి చెప్పకు. కుక్కల ముందు మధుర పదార్థాలు పడేయకు అన్నాడు యేసు. మీరు పూజ చేయొచ్చు, మీరు జపం చేయొచ్చు. మీరు ధ్యానం చేయొచ్చు. మీరు విచారణ చేయొచ్చు. మీరు యాత్రలు చేయొచ్చు, నదుల్లో మునగచ్చు. మీ కుల ఆచారం ప్రకారం, మీ మత ఆచారం ప్రకారం, మీరు ఉండచ్చు. కాని ఎవడైతే తన వాసన విడిచిపెట్టడానికి ప్రయత్నం చేయడో, తన వాసననే తను repeat చేసుకుంటూ ఉంటాడో, వాడు భక్తుడు అని అనటానికి వీలు లేదు. వాడు కేవలం ప్రాపంచిక మానవుడే. నేను పూజ చేస్తున్నాను. నా పూజ వల్ల నా వాసన పల్చబడుతోందా? లేకపోతే ధ్యానం చేస్తున్నాను. నా ధ్యానం వల్ల నా వాసన పల్చబడుతోందా? నాకు కొన్ని గుణాలు ఉంటాయి. మీకు కొన్ని గుణాలు ఉంటాయి. గుణాల్లో తేడా ఉండచ్చు. కాని అందరూ ఏమి అంటారు? నేను, నేను అంటారు. వారు చెప్పేది మంచి అవ్వచ్చు, చెడ్డ అవ్వచ్చు. కాని నేను చెబుతున్నాను, నేను చెబుతున్నాను అంటారు. గుణాలలో తేడా ఉన్నా నేను మటుకు అందరికి ఉన్న మాట నిజమే. నల్లగా ఉన్న వాళ్లకి నేను ఉంది. తెల్లగా ఉన్న వాళ్లకి నేను ఉంది. మంచి వాళ్లకి నేను ఉంది. చెడ్డ వాళ్లకి నేను ఉంది. దేవుడు ఉన్నాడు అని చెప్పే వాడికి నేను ఉంది. దేవుడు లేడు అని చెప్పేవాడికి నేను ఉంది. మిగతా విషయాలు ఉన్నాయో, లేదో నాకు తెలియదు. వాళ్ళు ఎంతవరకు మంచి వాళ్లో నాకు తెలియదు. కాని తెలిసిందల్లా ఒక్కటే. ఈ నేను అన్ని చోట్లా ఉంది. అన్ని దేశాల్లో ఉంది. అన్ని జాతుల్లో ఉంది. అన్ని రంగుల్లో ఉంది. అన్ని మతాలలో ఉంది, అన్ని కులాల్లో ఉంది. ఒకటి మటుకునీకు లేదు అని అనటానికి వీలు లేదు, అది నేను.

ఈ నేను ఉంటేనే బేధం కనిపిస్తుంది. ఈ నేను లేకపోతే బేధం ఏముంటుంది? ఈ నేను ఉంటేనే అనేకత్వం ఉంటుంది. ఈ నేను లేకపోతే ఏకత్వం లోకి జారిపోతుంది. ఏదైతే నేను నేను అంటున్నామో, ఈ నేను పోతే సృష్టి భావన దాటిపోయి ఆత్మ భావనలో

కలిసిపోతావు. సాధకుడు అంటే ఎవడు? తనలో ఉన్న వాసనలను repeat చెయ్యకుండా, ఆ వాసనకి సంబంధించిన బీజాన్ని ఎవడైతే తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడో, ఎవడైతే నిర్భయంగా తన వాసన మీద పోరాడి దానిని నిశ్శేషం చేయడానికి, ఆ వాసనని నిర్మూలించడానికి ప్రయత్నం చేస్తున్నాడో, వాడు పూజ చెయ్యనివ్వండి, జపం చేయనివ్వండి, ధ్యానం చేయనివ్వండి, విచారణ చేయనివ్వండి, ఎవడైతే వాసనా క్షయం కోసం ప్రయత్నం చేస్తున్నాడో, వాడు సాధకుడు. కాని నాకు ఏదైనా వాసన ఉంది అనుకోండి ఆ వాసనని ఆచరణలో పెట్టాను అనుకోండి ఆ వాసన మరింత బలపడిపోతూ ఉంటుంది. గీతలో ఏమని చెప్పారు అంటే ఇంద్రియచాపల్యం ఉన్న వాడి బుద్ధి ఎప్పుడూ స్థిరంగా ఉండదు. ఏ మనిషికి అయితే ఇంద్రియ చాపల్యం ఉందో, వాడు గంటకు ఒక రకంగా మాట్లాడుతూ ఉంటాడు. నా మనసు గనుక అణగకపోతే, నా మనసు గనుక పల్చబడకపోతే, భగవంతుడి వైపుకు దారే కనబడదు. రాగద్వేషాలు అంటే పాములు వంటివి. పాముని చూస్తే మనం ఎంత దూరంగా ఉంటామో, రాగ ద్వేషాలకి మనం అంత దూరంగా ఉండాలి. రాగము దుఃఖాన్ని తీసుకు వస్తుంది. ద్వేషం దుఃఖాన్ని తీసుకు వస్తుంది. ఇష్టము దుఃఖాన్ని తీసుకు వస్తుంది. అయిష్టం దుఃఖాన్ని తీసుకు వస్తుంది. ఎవరు సాధకులు? ఎవడైతే తనకున్న వాసనని పల్చబడేటట్టు చేసుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడే సాధకుడు. వాసనని బలపర్చుకునేవాడు లోకానికి కట్టుబడిపోతాడు. వాడు ఆరోజుకారోజు లోకానికి దగ్గర అవుతాడు. ఎవడైతే తన వాసనను తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడు దేవుడికి దగ్గర అవుతాడు. అంటే దేవుడికి దగ్గర అయ్యేవాడు సాధకుడా? లోకానికి దగ్గర అయ్యేవాడు సాధకుడా? మీరే చెప్పండి. మీరు పూజ చేసి, జపం చేసి మీ వాసనని పల్చ బడేటట్టు మీరు చూసుకోకపోతే మీరు ప్రాపంచిక మనుషులే. మీకు చదువు వల్ల దుఃఖం ఆరదు. నువ్వు చేసే ఉద్యోగం వల్ల నీకు దుఃఖం ఆరదు. నీకున్న సోషల్ స్టేటస్ అంటే సాంఘికంగా నీకున్న గౌరవాలు, నీకున్న అంతస్తులు బట్టి నీకు దుఃఖం ఆరదు. ఎక్కడ పుట్టినా నీకు దుఃఖం తప్పదు. ఏ లోకంలోకి వెళ్ళినా నీకు దుఃఖం తప్పదు. ఏ జన్మలోకి వెళ్ళినా నీకు దుఃఖం తప్పదు. మీరు మహోన్నతమైన, ఉదాత్తమైన పదవులను అధిష్టించినా మీకు దుఃఖం తప్పదు. దుఃఖం ఎక్కడ లేదు? ఒక్క ఆత్మలో లేదు. ఆత్మను తెలుసుకున్న వాడే దుఃఖం నుండి బయట పడతాడు. ఎవడికి అయితే ఆత్మ తత్త్వం అవగాహన అయ్యిందో వాడే ఈ దుఃఖసముద్రం నుండి ఒడ్డుకు చేరుకోగలడు కాని, ప్రకృతి మానవుడు వాడికి

బాహ్యంగా ఎంత ఉన్నప్పటికీ, వాడు దుఃఖం నుండి బయట పడలేడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే, ఈ దేహం పుట్టిన రోజు నువ్వు పుట్టిన రోజు కాదు. ఈ దేహం మరణించిన రోజు నువ్వు మరణించిన రోజు కాదు. ఎప్పుడైతే నేను, నేను అని నీ మొదటి తలంపు పుట్టిందో అప్పుడు నువ్వు పుట్టావు. నేను, నేను అనే మొదటి తలంపు ఎప్పుడైతే మరణించిందో అప్పుడు నువ్వు మరణిస్తావు. ఈ దేహం పుట్టుక ఒక పుట్టుక కాదు. దేహం మరణం ఒక మరణం కాదు. అహంకారం పుట్టినప్పుడు నువ్వు పుట్టావు. అహంకారం మరణించినప్పుడు నువ్వు మరణిస్తావు. ఈ లోపు నీకు మరణం లేదు మరి ఈ మరణాలు ఏమిటి? ఇదంతా కల్పితం. ఇదంతా మిథ్యే. మహా సామ్రాజ్యాలే కాలప్రవాహంలో కొట్టుకుపోయినవి. నువ్వు ఎంత? నీ శరీరం ఎంత? Nothing is too heavy for destiny.

మనకు అన్ని రకాల భోగాలు ఉన్నాయి అనుకోండి అలాగని మన శరీరం ఎంతకాలం ఉంటుంది. బైబిల్ లో ఒక మాట ఉంది, నీకు బాహ్యమైన property తోటి తాదాప్యం గనుక నువ్వు పొందుతుంటే నీకు ఎన్నడూ మోక్షం రాదు అన్నాడు. ఏమి చెబుతున్నారండి, వినండి, ఆనందించండి. అంటే మీరు ఎవరు? ఆత్మ స్వరూపం. నువ్వు కాని దాని మీద నీకు తాదాప్యం ఉన్నంత కాలం. అంటే దాని మీద నీకు అటాచ్మెంట్ ఉన్నంతకాలం ఈ property నాది అని నువ్వు అనుకున్నంత కాలం నీకు మోక్షం ఏమిటి? నీకు స్వర్గ రాజ్యం ఏమిటి? నీకు వైకుంఠం ఏమిటి అని అడిగాడు. బాహ్యంగా ఒక వస్తువు తోటో, ఒక ల్యాండ్ తోటో, ఒక power తోటో నీకు తాదాప్యం ఉన్నప్పుడు నువ్వు మోక్షాన్ని ఆశించినా ఎన్నడూ రాదు. మనసు అంతర్ముఖం అయ్యే కొలది దేవుడే నీ స్వరూపంగా వ్యక్తం అవుతాడు, అంతకంటే నీకు ఏమి కావాలి? మనకి భగవంతుని కంటే భగవంతుడు సృష్టించిన విషయాలు అంటే, వస్తువులు అంటే ఎక్కువ సరదా. ఎవరి ముక్కు అయినా చాలా అందంగా ఉంది అనుకోండి. ఆ ముక్కు ఎంత బావుందో అనుకుంటాం. కాని ఆ ముక్కుని తయారుచేసిన ఈశ్వరుడు



**ఈశ్వరుని పట్ల గురువు పట్ల మనకు నిజమైన భక్తి కుదిరితే, ఆ భక్తి ప్రవాహంలో మనలో ఉన్న బలహీనతలనే దుంగలు, వాసనలు అనే బండరాళ్ళు బయటకు కొట్టుకొనిపోతాయి, కాలి బూడిద అయిపోతాయి.**

ఎంత గొప్పవాడు అని నాకు ఈశ్వరుడు గుర్తుకు రాడు. మీరు పువ్వుల తోటి దేవుడిని పూజిస్తున్నారు. మంచి మంచి పనుల చేసి దేవుడిని ఎందుకు ఆరాధించకూడదు? మీరు మంచి మంచి పనులు చేయడం వల్ల మీ మీద ఈశ్వరుడి అనుగ్రహం కలుగుతుంది. ఆ అనుగ్రహంలో నీ మనసు కరిగిపోతుంది. దేహగతమైన నేను, ఇంద్రియగతమైన నేను, మనోగతమైన నేను, అహంకారగతమైన నేను, నీ నేను ఎప్పుడైతే ఆరిపోయిందో అప్పుడు నీ లోంచే ఒక మహత్తరమైన శక్తి, ఒక అతీతమైన శక్తి, నీ ఇంద్రియాలకి, నీ మనసుకి, నీ బుద్ధికి, నీ తెలివికి, నీ సైన్సుకి అందనటువంటి అతీతమైన శక్తి నీ హృదయంలో నుంచి విజృంభించి, నిన్ను స్వాధీనం చేసుకుని తన స్వరూపాన్ని నీకు ఇస్తుంది. అది అఖండమైన నేను. అది పరిమితం అయినది కాదు, అది అపరిమితం అయినది. ఆ ఆనందం పరిపూర్ణమైనది. ఆ శాంతి పరిపూర్ణమైనది. దానికి అసలు మరణమే లేదు. మరణం లేని వాడికి జన్మ ఎలా వస్తుంది. మీ దేహం పుట్టింది. దేహానికి సంబంధించిన సుఖాలు మీరు అనుభవిస్తున్నారు. ఆత్మ పుట్టలేదు. పుట్టని ఆత్మ సుఖం దగ్గరకు మిమ్మల్ని తీసుకుపోవటానికి భగవాన్ చూస్తున్నారు. ఎవరండి ఈ రమణమహర్షి? ఆయన దగ్గరకు రాష్ట్రపతులు వచ్చారు, మినిస్టర్స్ వచ్చారు, ఉన్నతమైన ఉద్యోగస్తులు వచ్చారు, గొప్ప గొప్ప సినిమా actors వచ్చారు. ఆర్టిస్టులు వచ్చారు, singers వచ్చారు, ఇంకా ఎంతోమంది రైటర్స్ వచ్చారు, ఇందులో ఎవరు కూడా ఆయన దృష్టిని ఆకర్షించలేదు. ఎందుచేతనంటే ఆయన ఆత్మలో కూరుకు పోయారు. ఆవైభవం అటువంటిది. సరదాగా స్కూలుకి వెళ్లి వచ్చే పిల్లవాడు, భగవద్గీత అంటే ఏమిటో, ఉపనిషత్తులు అంటే ఏమిటో, భక్తి అంటే ఏమిటో, యోగం అంటే ఏమిటో తెలియని ఈ కుర్రవాడు కేవలం పదహారో సంవత్సరంలో, టీనేజ్‌లో ఉన్నటువంటి ఈ కుర్రవాడు, ఏదో శక్తి వచ్చి వేగంగా అతని మీద పడింది. ఈ రహస్యం ఏమిటి అని మీరు నన్ను అడగకండి, ఇది దేవ రహస్యం. భక్తి అంటే ఏమిటో తెలియదు. ఆత్మను తెలుసుకోవాలి అని అనుకోలేదు. ఏ దేవతలు కరుణించారో, మృత్యువు వచ్చి మీద పడి తాను దేహం కాదు అని, తాను ఆత్మని అని తెలుసుకున్న ఈ ప్రక్రియ అంతా కూడా ఈ ఆపరేషన్ అంతా కూడా ఇరవై నిమిషాలలో జరిగిపోయింది.

దేహం నేను అనుకునే వాడికి చావు. దేహం తాను కాదు అని తెలిసిన వాడికి చావు లేదు. చచ్చిపోయేది ఎవరు? దేహం. అది నువ్వా? మీరు వెళ్లిపోతున్నారు, మేము ఉండిపోతున్నాము అని భగవాన్‌తో అంటే.... నాకు వెళ్లటానికి చోటు ఎక్కడ ఉంది? ఏమి

immortal words చూడండి, ఆ మాటలకి మరణం లేదు. ఒకవేళ నిజంగా వెళ్ళిపోవటానికి నేను ప్రయత్నం చేసినా ఎక్కడికి వెళతాను? నేను లేని చోటు అంటూ ఒకటి ఉంటే అక్కడకు వెళతాను. నేను లేని చోటు లేకపోతే ఎక్కడకు వెళతాను? Iam not going away, I am here. నేను వెళ్ళిపోవటం లేదు. నేను ఇక్కడే ఉంటాను. నేను ఎక్కడికి వెళ్ళగలను? ఒక చోట ఉండి, మరొక చోట లేకపోతే అది ఆత్మ వస్తువా? నేను దేహంలో ఉన్నాను అని, నా దేహం బయట ప్రపంచం ఉందని, ఈ ప్రపంచానికి ఆవల ఎక్కడో దేవుడు ఉన్నాడు అని, ఎంతకాలం అయితే అనుకుంటూ ఉంటావో, అంతకాలం కూడా నీకు జన్మలు తప్పవు. దుఃఖం తప్పదు. భగవంతుడు ఏమంటున్నాడు అంటే నీ కళ్ళు నొప్పి పెడతాయి. నన్ను అస్తమాను బయట ఏమి చూస్తావు? నీ స్వరూపంగా నేను వ్యక్తం అవుతుంటే నన్ను ఇష్టపడవా అంటున్నాడు. కానీ దేవుడు ఎంతసేపు మనకు వేరుగా ఉండాలి, స్వర్గం లోనో, వైకుంఠం లోనో, గుడిలోనో ఉండాలి అనుకొంటున్నాము. ఆ గుళ్లో ఉండను. అక్కడ నుంచి వచ్చేస్తాను. నీ హృదయంలో ఉంటాను అని దేవుడు మనతో చెప్పినప్పటికీ మనం వద్దు అంటాం. ఎందుకు వద్దు అంటాం అంటే నా హృదయంలోకి వచ్చేస్తావు అనుకో, అడగటానికి మరి ఎవరిని అడుగుతాను నేను? అందుచేత గుళ్ళోనే ఉండు. అక్కడ నుంచి కదలకు. అక్కడకు వచ్చి నేను నమస్కారం పెడతాను. నా కోరిక నీకు చెబుతూ ఉంటాను ఆ కోరికని నువ్వు తీరుస్తూ ఉండు, మళ్ళీ నీకు అభిషేకాలు అవి చేయించేస్తూ ఉంటాను. నువ్వు వచ్చి నా స్వరూపంగా వ్యక్తం అవుతావు అనుకో నాకు రెండో వస్తువు కనపడదు, అప్పుడు ఎవరిని అడుగుతాను నేను? అడగటానికి ఏమి ఉండదు. అందుచేత దేవుడు వచ్చి నా స్వరూపంగా వ్యక్తం అవుతాను అన్నా నేను ఒప్పుకోను. దేవుడు నాకు వేరుగా ఉండాలి అనుకుంటాను. నాకు ఏదో వరం కావాలి అని అడుగుతాను ఆయన ఇచ్చేస్తాడు. అదే భక్తి అనుకుంటున్నారు. దేవుడు ఏదో మీకు వరం ఇస్తాడు అండి, ఆ వరాన్నిశుభ్రంగా మీరు అనుభవించేస్తారు. మరి తరువాత మీ మాట ఏమిటి? అంటే మీకు temporary ఉద్యోగాలే కాని permanent postలో వేస్తాం అన్నా వద్దు అనేలా ఉన్నారు. ఎంతసేపు అహంకారాన్ని సంతృప్తి పరుచుకోవ టానికే మీరు ప్రయత్నం చేస్తారు కాని, అహంకారాన్ని తొలగించుకోవడం కోసం, అహంకారాన్ని నాశనం చెయ్యడం కోసం మీరు ఎందుకు ప్రయత్నం చెయ్యరు? మీ అహంకారాన్ని satisfy చేసుకోవడానికా మీకున్న భక్తి? లేకపోతే మీ అహంకారాన్ని remove చెయ్యడానికా మీకున్న భక్తి? మీరు చాలా మంచి

భక్తులు, మీరు తెల్లవారుఝామున ఒంటి గంటకు లేచి భజన మొదలు పెడుతున్నారు. నిజమేనండి కాని ఈశ్వరుడు తన స్వరూపాన్ని మీకుఇస్తాను అంటే మీరు అడ్డుకునేలా ఉన్నారు, అది భక్తా? అంటే ఈశ్వరుడి కంటే ఈశ్వరుడు కల్పించిన ఈ సృష్టి అంటే మనకు ఎక్కువ ఇష్టంగా ఉంది. దానికి కారణం ఏమిటి? నా ఆదర్శాలు, నా ఆశయాలు, నా కోరికలు, నా కాంక్షలు, దేహం నేను అనేది మొదటి తలంపు. ఆ మొదటి తలంపు లోంచే మిగతా తలంపులు వస్తాయి. దేహం నేను అని చెబుతున్నాను అంటే ఈ చెప్పేది ఎవరు? అహంకారమే చెబుతుంది. ఆత్మ చెప్పటం లేదు. అహంకారానికి దేహం కావాలి, అహంకారానికి పునర్జన్మ కావాలి. అహంకారానికే దేవుడు కావాలి. ఆత్మకి ఏది అక్కర్లేదు. నాలుగు సంవత్సరాల క్రితం పాలకొల్లులో డాక్టర్లు అందరూ నేను చచ్చిపోతాను అని చెప్పేసారు, అప్పుడు నాకు ఏమి అనిపించింది అంటే ఈ శరీరం ఇప్పుడు కుర్చీలో ఉంటుంది, తరువాత గోతిలో ఉంటుంది అనిపించింది. మాట వరసకి మీకు భోగం పట్ల సంకల్పం కాని, ఆసక్తి కాని ఏమి ఉదయించటం లేదు అనుకోండి, మీకు దేహం ఉన్నా ఒకటే, ఉడిపోయినా ఒకటే. అహంకారం ఉంటే నువ్వు ఉన్నావు. అహంకారం ఉంటే నేను ఉన్నాను. అహంకారం ఉంటే సమాజం ఉంది. అహంకారం ఉంటే పునర్జన్మ ఉంది. అహంకారం ఉంటే దేవుడు ఉన్నాడు. అహంకారం ఉంటే కర్త ఉన్నాడు. అహంకారం లేనివాడికి ఏది లేదు. నాకు దుఃఖం వచ్చింది అంటాడు. దుఃఖం ఎవడికి? అహంకారానికే. నీ శరీరం దుఃఖ పడుతోందా? నీ శరీరంలోని నేను అనే బుద్ధి దుఃఖ పడుతుంది. నేను చచ్చిపోతే ఈ లోకం ఏమి అయిపోతుంది అని. అదే మీరు ఆలోచించేది. మరి నువ్వు పుట్టక ముందు కూడా ఈ లోకం ఉంది కదా, అప్పుడు మరి ఈ లోకాన్ని ఎవరు చూసారు? నువ్వు పుట్టక ముందు ఈ లోకం ఉంది. నువ్వు మరణించిన తరువాత కూడా ఈ లోకం ఉంటుంది. నువ్వు పుట్టకముందు ఈ లోకాన్ని ఎవడు చూసాడో, నువ్వు మరణించిన తరువాత కూడా ఈ లోకాన్ని వాడే చూస్తాడు. నువ్వేమి లోకాన్ని ఉద్ధరించటం లేదు. ఒకసారి గవర్నర్ గారి భార్య భగవాన్‌ను చూడటానికి వచ్చారు. ఈ విషయం జాగ్రత్తగా వినండి లోకం ఎలా ఉంటుందో చూడండి, గవర్నర్ గారి భార్య ఆత్మ గురించి ఏమి అడగలేదు, జ్ఞానం గురించి ఏమి అడగలేదు. సమాజం యొక్క శ్రేయస్సు గురించి ఏమి అడగలేదు. ఒక అరగంట కూర్చొని ఆవిడ వేసిన ప్రశ్న ఏమిటి అంటే ఏవండీ మిమ్మల్ని చూడటానికి ఎంతోమంది స్త్రీలు వస్తున్నారు. ఆ గోచి పెట్టుకుని కూర్చొంటున్నారు ఏమిటి? ఈ ప్రశ్న అడిగింది ఎవరు?

గవర్నర్ గారి భార్య. మనకంటే గవర్నర్ అనుకోండి భగవాన్‌కి గవర్నర్ ఏమిటి? లోకమే లేని వాడికి గవర్నర్ ఏమిటండి? అప్పుడు భగవాన్ అన్నారు అమ్మా..... నువ్వు ఏ దృష్టి తోటి వచ్చావు? ఎవరో జ్ఞాని ఉన్నారు చూసి వెళదాం, జ్ఞానిని చూస్తే పుణ్యం, జ్ఞానిని చూసినవాడు వట్టి చేతుల తోటి బయటకు వెళ్ళడు అని వచ్చావు. గౌతమబుద్ధుడు ఏమి బోధించక్కర లేకుండానే ఆయన ముఖం చూస్తే నూట యాభై మందికి జ్ఞానం కలిగింది. జ్ఞాని యొక్క వైభవం అటువంటిది. రాతి మనుషులకి జ్ఞాని యొక్క వైభవం ఏమి తెలుస్తుంది? ఎంతసేపు వాళ్ళ పూజ, వాళ్ళ జపం, రాళ్ళకే పరిమితం అయ్యింది. రాళ్ళ చుట్టూ తిరిగే వారికా జ్ఞానం యొక్క వైభవం తెలిసేది? ఎందుకు వచ్చావు నువ్వు? ఎవరో జ్ఞాని ఉన్నారు అంటే చూడటానికి పాండిచ్చేరి నుంచి వచ్చాను. అమ్మా... నువ్వు ఏ దృష్టి తోటి వచ్చావో, ఆ దృష్టి తోటే వెనక్కి వెళ్ళిపో. ఈ గోచి గొడవ నీకు ఎందుకు? అంటే ఎవరిని ఏమి అడగాలో, ఎప్పుడు అడగాలో, ఎక్కడ అడగాలో, ఎలా అడగాలో, తెలియకపోవటం కూడా అజ్ఞానమే. ప్రశ్నించటానికి కూడా కొంత జ్ఞానం అవసరం. నిజంగా మీరు జీవితంలో అభివృద్ధిలోకి రావాలంటే, భౌతికమైన జీవితంలో కాని, ఆధ్యాత్మిక జీవితంలో కాని, అభివృద్ధిలోకి రావాలంటే, మీ మనసును శాంత పరచుకోవాలి. మీ మనసును నెమ్మది పరచుకోవాలి. మీ మనసులో సత్వగుణాన్ని పెంచుకోండి, అప్పుడు ఏమి అవుతుంది అంటే మోక్షానికి వెళ్ళే దారి కనిపిస్తుంది. మీ మనసు పూర్తిగా అణిగినప్పుడు, మోక్షానికి వెళ్ళే దారిని చూపిస్తుంది. మనం ఏమి చేయాలి అంటే మనం తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం మాట్లాడే మాటలు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. నిద్రలో జాగ్రత్తగా ఉండాలి. భగవాన్ ఏమి చెప్పారంటే సాధన అంటే ఈ మూడు జాగ్రత్తగా ఉండండి. మీరు అతిగా తినద్దు, మితంగా తినండి. అతిగా తింటారు అనుకోండి మీ మనసులో చాపల్యం వస్తుంది. బుద్ధిలో చాపల్యం వస్తుంది. శరీరానికి రోగం తొందరగా వస్తుంది. అందుచేత తగు మాత్రంగా యుక్తంగా తినమని భగవాన్ చెప్పారు. మాటలు కూడా ఎక్కువ మాట్లాడవద్దు. మన అవసరానికి

**మనం నిజమైన భక్తులమైతే మనం గురువుని అడిగేది ఒక్కటే - నాకు భక్తి అనే బిక్ష పెట్టమని, అంతకంటే అడిగేది ఏమీ లేదు.**



మించి మాట్లాడకూడదు. కారణం ఏదైనా అవసరానికి మించి మాట్లాడుతున్నాం అంటే మనలో అహంకారం ఉన్నట్టు. లోకవాసన, శాస్త్రవాసన సాధన చేస్తే పోతుంది ఏమో కాని, దేహ వాసన మటుకు మనలను పీడించేస్తుంది. ఒక స్వామి వారిని అడిగారట లోకంలో సర్వ సాధారణంగా ఏ మనిషి అయినా సరే నిజం కంటే అబద్ధం ఎక్కువ ఇష్ట పడతాడు. లోకానికి కూడా నిజం కంటే అబద్ధమే ఎక్కువ ఇష్టం. ఎందుచేత? దానికి ఆ స్వామి వారు ఏమి చెప్పారంటే, లోకం అబద్ధం. అందుచేత అబద్ధం అంటే ఎక్కువ ఇష్టం అని చెప్పారు.

మనకు మోక్షాన్ని ఇచ్చేది సమాజం కాదు భగవంతుడు. మనకు మోక్షం ఇచ్చేది ప్రభుత్వం కాదు భగవంతుడు మనకి మోక్షం ఇస్తాడు. అందుచేత మనం చేసే పని చూసి భగవంతుడు సంతోషించాలి. అంటే భగవంతుడు సంతోషించే పని మనం చెయ్యాలి. భగవంతుడు ఏ పని అయితే మనలని చెయ్యమన్నాడో ఆ పని చేసి తీరాలి. ఏదైతే వద్దు అని చెప్పాడో దానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండటానికి ప్రయత్నం చెయ్యాలి. మీ పని ఏదో మీరు జాగ్రత్తగా చేసుకోండి. ఇతరుల విషయాలలో సాధ్యమైనంత వరకు జోక్యం చేసుకోవద్దు అన్నారు భగవాన్. ఎందుచేత అంటే ఇతరుల గొడవలలో జోక్యం చేసుకునే కొలది నీకు అహంకారం పెరిగిపోతుంది అని చెప్పారు. అందుచేత జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడు. నీ మనసుని బాగుచేసుకో, నీ మనసు ఎప్పుడైతే బాగుపడిందో నీ జీవితం ఉద్ధరించబడుతుంది. నీ మనసు బాగుపడకుండా నీ జీవితం ఉద్ధరించబడదు. నువ్వు చేస్తున్న సాధన వల్ల, నువ్వు చేస్తున్న ధ్యానం వల్ల, నువ్వు చేస్తున్న విచారణ వల్ల, నీలో ఉన్న అజ్ఞానం ఏమైనా పోతోందా లేదా అని మీరు చూసుకోండి. ఎదుటివాళ్ళు మెచ్చుకుంటున్నారా లేదా అని మీరు చూసుకోకండి. ఎదుటివాళ్ళు ఎవరికి? ఆత్మకు ఇతరులు లేరు. ఈ అహంకారానికి ఎదుటివాళ్ళ గొడవ కావాలి. అందుచేత భగవాన్ అన్నారు ఇతరుల గొడవలలోకి నువ్వు వెళ్ళే కొలది నీ అహంకారం పెరుగుతూ ఉంటుంది. దైనందిన జీవితంలో బహుజాగ్రత్తగా ఉంటూ మీరు కేవలం పూజగదిలో ఉన్నప్పుడే దేవుడి ధ్యాస కాదు ఎక్కడ ఉన్నా దేవుని స్మరిస్తూ, ఏ పని చేసినా ముందు దేవుని మీరు స్మరించండి. అన్నం తినేటప్పుడు కూడా ఇది భగవంతుడి ప్రసాదం అనుకోండి. దేవుడి దగ్గరకు రెండు అరటి పళ్ళు పట్టుకు వెళతాం, మన అరటి పళ్ళే, అర్చకులు ఏమి చేస్తారు? ఒక అరటిపండు ఆయన పుచ్చుకుని, ఇంకొక అరటిపండు ఇచ్చేస్తారు. దానిని ప్రసాదం అంటాం. పూజారి దేవుడికి సమర్పణ

చేసి ఇచ్చాడు కాబట్టి అది ప్రసాదం. అందుచేత సమర్పణ బుద్ధి తోటి కనుక మీరు పని చేస్తుంటే, మీకు భగవంతుడు ఏమి ఇస్తాడు అంటే ప్రసాదం అనే అరటిపండు కాదు, ప్రసాదం అనే బుద్ధిని ఇస్తాడు. మీరు ఈ అరటి పళ్ళ తోటి సంతృప్తి పడిపోతున్నారా? ఈ ప్రసాదం అనే అరటి పండు, ప్రసాదం అనే కొబ్బరి కాయ కాదు ప్రసాదం అనే బుద్ధి ఇస్తాడు. ఆ ప్రసాదం అనే బుద్ధిని భగవంతుడు మనకు ఎప్పుడు ఇచ్చాడో, అప్పుడు ప్రసన్నమైనటువంటి ఆత్మ మనకు వ్యక్తం అవుతుంది. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఇంతకాలం మీరు పుట్టిన దేహానికి సంబంధించిన సుఖం అనుభవించారు. ఆత్మ పుట్టలేదు. పుట్టని ఆత్మకి సంబంధించిన సుఖం కూడా మీరు తెలుసుకోండి. ఆ సుఖంలో మీ మనసు గనుక మిళితం అయితే ఇంక ప్రకృతిలోకి రానే రాదు. ఆయన ఆత్మ గురించి చెప్పి ఊరుకోలేదు. You are that, అది నువ్వే అని చెప్పారు. ఆత్మ చాలా గొప్పది అని చెప్పాడు. ఆత్మ యొక్క ఔన్నత్యాన్నిచెప్పాడు. అగ్ని దానిని కాల్చలేదు అన్నాడు. ఏవండీ కత్తులు నరకలేవు అన్నాడు. ఆత్మ యొక్క ఔన్నత్యం గురించి చెప్పి చెప్పి అది ఎక్కడో ఉంది అనుకుంటున్నావు కానీ అది నీ హృదయంలోనే ఉంది, అహమాత్మా గుడాకేశ, అది నువ్వే అయి ఉన్నావు. నువ్వు దానికి వేరుగా లేవు. దేహం నేను అనుకోవటం వల్ల ఆత్మకి దూరంగా ఉన్నాను అనుకుంటున్నావు. నువ్వు ఆత్మవి అయి ఉన్నావు. నీ సాధన వల్లో, దేవుని యొక్క కృప వల్లో, సత్సాంగత్యం వల్లో నీకు దేహబుద్ధి ఎప్పుడైతే నశించిందో, ఆ క్షణంలో మెరుపు వస్తుంది. ఎప్పుడైతే ఆత్మ మెరిసిందో, ఆత్మఅనుభవం ఎప్పుడైతే కలిగిందో, అప్పడు నేను, నేను అనుకొనే దేహగతమైన నేను పోతుంది, అఖండమైన నేను నీకు తెలుస్తుంది. ఈ నేను పోతే నేను పోతానేమో ఎలాగండి అంటున్నాడు. నేను పోతే నువ్వు పోవు నువ్వు ఎవరో నీకు తెలుస్తుంది. దేహగతమైన నేను పోతే నువ్వు పోవు, శ్రీ కృష్ణుడు భగవద్గీతలో నేను నేను అని ఏ నేను గురించి చెప్పాడో ఆ నేను వచ్చి నిన్ను వరిస్తుంది. అబద్ధమైన నేను ఎప్పుడైతే పోయిందో, నిజమైన నేను నీకు తెలుస్తుంది. ఆ నేను ఈ దేహానికే పరిమితం అయినది కాదు, లోకానికి పరిమితం అయినది కాదు, ఒక దేశానికి, ఒక కాలానికి పరిమితం అయినది కాదు. కేవలం ప్రకృతికే పరిమితం అయినది కాదు. అది అఖండమైనది, పరిపూర్ణమైనటువంటిది. ఆ నేనుని తెలుసుకో, భగవాన్ నిన్ను నీవు తెలుసుకో, అంటే ఏమిటి? నిన్ను అంటే ఎవరండి? నిజమైన నేను. నీవు అంటే ఎవరు? ఇప్పుడు ఏదైతే నేను నేను అనుకుంటున్నావో ఆ నేను, అంటే దేహగతమైన నేను. నిన్ను నీవు తెలుసుకో అంటే ఏదైతే ఇప్పుడు నువ్వు

అనుకుంటున్నావో, ఏదైతే నీ అస్తిత్వం, దేహానికే పరిమితం అయ్యింది అనుకొంటున్నావో దేహానికే పరిమితం అయిన ఈ నేను సహాయంతో ఆ నేనుని అంటే నిజమైన నేనును తెలుసుకో. దేవుడి మీద ఇష్టం లేక, గౌరవం లేక చెప్పడం కాదు. మనల్ని అందరిని ఈ లౌకికమైనటువంటి మర్యాదల తోటి సంబంధం లేకుండా నిజం దగ్గరకు తీసుకు పోవడం కోసం చెబుతున్నాడు, ఎందుచేతనంటే నిజం తెలిసేవరకూ మనం ఈ బంధం నుండి విడుదల పొందలేము. అందుచేత మనల్ని నిజం దగ్గరకు తీసుకుపోవటం కోసం ఈ పోరాటం. నీవు నేను అణగ నిత్య ఆనందమయముగ నిలుచు స్థితి కరుణించు అరుణాచల. నేను అణిగిపోతున్నాను, నువ్వు కూడా అణిగిపో అంటే అరుణాచలేశ్వరుడిని కూడా అణిగిపోమంటున్నాడు. ఇదేమి మర్యాద అండి. దేవుడిని కూడా అణిగిపోమంటున్నాడు. ఈ ద్విపద ఇలా ఉంది? మీ భగవాన్‌కి భక్తి తక్కువా? మా భగవాన్‌కి భక్తి రుచి తక్కువేమో కాని, మా భగవాన్‌కి భక్తి కాదండి ప్రధానం. ఆత్మ దగ్గరకు మనలని మోసుకుపోవటానికి ఆయన ఈ సృష్టిలోకి వచ్చాడు. ఆయన వచ్చిన పని ఆయన చేసుకుపోతున్నాడు. మీకు నచ్చవచ్చు, నచ్చక పోవచ్చు, భక్తి ఉంది అనచ్చు, లేదు అనచ్చు. ఆయన ఏ పని మీద అయితే ఈ భూమి మీదకు వచ్చాడో, అక్కడకు తీసుకుపోతున్నాడు. మీరు భక్తి ఉంది అనుకోండి, లేదు అనుకోండి. ఆయనను ఏమి అనుకున్నా ఇబ్బంది లేదు. ఆయనకి భక్తి ఉంది అనుకున్నా ఆయనకి వచ్చే లాభం లేదు. భక్తి లేదు అనుకున్నా ఆయనకి వచ్చే నష్టం లేదు. సూర్యుడి మీద ఉమ్ము వేస్తే మన ఉమ్ము ఎలా వెనక్కి వస్తుందో ఇది అంతే. పైగా తుంపరలు వచ్చి మన మీదే పడతాయి. ఆయన చెప్పే లోతుకి దిగలేక, ఆ అందాలు చూడలేక చెప్పే మాటలు ఇవి, నీవు నేను అణగ నిత్య ఆనందమయముగ నిలుచు స్థితి కరుణించు అరుణాచల జ్ఞానశిఖరాలకి, శాంతిశిఖరాలకి, ఆనందశిఖరాలకి, మనలను మోసుకుపోతున్నాడు.



**మనం చేసే సాధనలు, సత్సంగాలు ఇవన్నీ కూడా అమృతానుభవం పొందటానికే. అమృతానుభవం పొందేవరకూ ప్రతి జీవుడినీ అశాంతి వెంటాడుతుంది, దుఃఖం వెంటాడుతుంది.**

# గురుదర్శనం

గురువు నిన్ను అనుగ్రహించటానికి పదిమాటలు అక్కరలేదు, ఒక్క చూపు సరిపోతుంది, ఒక్క స్పర్శ సరిపోతుంది, ఒక్కమాట సరిపోతుంది. ఒన్ లుక్ ఇజ్ ఎనఫ్, ఒన్ టచ్ ఇజ్ ఎనఫ్, ఒన్ వర్డ్ ఇజ్ ఎనఫ్ (one look is enough,one touch is enough,one word is enough). అని రమణమహర్షి చెప్పారు.

గౌతమబుద్ధుడి కాలంలో బింబిసారుడు అని ఒక చక్రవర్తి ఉండేవాడు. బుద్ధుడు ఆయనరాజ్యంలో ఉన్నంతకాలం ఒక వనం ఇచ్చి ఆ వనంలో ఉండమన్నాడు. బింబిసారుడి కుటుంబసభ్యులు అందరికీ బుద్ధుడు అంటే ఇష్టం, బింబిసారుడు రోజూ వెళ్లి బుద్ధుడిని దర్శించేవాడు. కానీ బింబిసారుడి భార్యకి బుద్ధుడు అంటే ఇష్టం ఉండదు. బింబిసారుడి భార్య చాలా అందంగా ఉంటుంది. మీరు చాలా అందంగా ఉంటారు, దేశంలో మీఅంత అందం ఎవరికీ లేదు, ఇలా 24 గంటలూ ఆవిడని పొగుడుతా ఉండాలి. అది ఒక బలహీనత ఆవిడకి. బుద్ధుడు అసలు రూపానికే విలువ ఇవ్వనప్పుడు ఆవిడని ఎందుకు పొగుడుతాడు! అందుచేత బింబిసారుడు ఎప్పుడు వెళ్లినా బుద్ధుడి దగ్గరికి నేను రాను అని చెప్పేది. మీరు బుద్ధుడి దగ్గరికి రాకపోయినా బుద్ధుడు ఉన్న వనం చూడాలి చాలా బాగుంటుందని బింబిసారుడి భార్యతోటి కొంతమంది చెప్పేవారు. ఆయన వనంలో ఎప్పుడు ఉండడో చెప్పండి అప్పుడు వచ్చి చూసి వచ్చేస్తాను అంది. ఆయన రోజూ 11 నుంచి 12 గంటల మధ్యన ఒకపూటే భోజనం చేస్తాడు. ఆ సమయంలో వనంలో ఉండడు బిక్షకి వెళ్లిపోతాడు,మీరు ఆ టైములో రండి అన్నారు.


ఆవిడ బుద్ధుడు లేని సమయంలో వనం చూడటానికి వెళ్లింది. ఆ వనం చూసేటప్పటికి గంట దాటిపోయింది. ఈవిడ తిరిగి వెళ్లిపోతుంటే బుద్ధుడు ఎదురు వచ్చాడు. ఒకసారి బింబిసారుడి భార్య వంక చూశాడు. ఈవిడ కూడా చూసింది. అటువంటి చూపు బింబిసారుడి భార్య జీవితంలో ఎప్పుడూ చూడలేదు. ఆ బుద్ధుడి చూపులో మాయ లేదు, కామం లేదు, కోరిక లేదు, 100% కంపాషన్. అటువంటి చూపు ఆవిడ ఏ మనిషిలోనూ చూడలేదు. వీడు మనిషా, దేవతాపురుషుడా! అనుకొంది. బుద్ధుడు ఊరికే ఆవిడ వంక చూసి వెళ్లిపోయాడు, ఆవిడని ఏమీ పలకరించలేదు, ఆవిడ కూడా బుద్ధుడిని పలకరించలేదు. కానీ ఇంటికి వెళ్లిపోయిన తరువాత, ఆ చూపు ఆవిడలో మార్పు

తీసుకురావటం ప్రారంభించింది. అంత వండర్ఫుల్ లుక్ ఎప్పుడూ చూడలేదు. ఆ చూపువల్ల ఏమయింది అంటే, తాను సౌందర్యవతిని అనే గర్వం పోయింది. ఆయన చూపు ఎంత అందంగా ఉందో, నా రూపం అంతకంటే ఎక్కువ అందంగా ఉందా? ఆ చూపుకంటే గొప్పగా ఉందా నా అందం అని ఆవిడలో ఆవిడ ప్రశ్నించుకొని ఆ రూపానికి సంబంధించిన గర్వం పోయింది.

ఈవేళ మీలో కొంతమంది అందంగా ఉండవచ్చు, ఇంకో నాలుగు ఏళ్ళు అయిన తరువాత చూస్తే మీకు ముసలితనం వచ్చాక చూస్తే మీవంక చూడలేము అసలు! మీ అందం నిజం కాదు, మీ డబ్బు నిజం కాదు, మీ కీర్తి నిజం కాదు. నిజము కానిది ఏదీ సత్యము కాదు. ఇది బుద్ధుడి సిద్ధాంతం. మీకేమైనా గౌరవాలు ఉంటే, అది నిజం అనుకొంటున్నారేమో! మహాత్మాగాంధీ లాంటి వారిని కూడా దేశం మరిచిపోతోంది. మీరు వెయ్యి ఎకరాలు సంపాదించి ఇచ్చినా, చనిపోయాక 12వ రోజుతోటి మిమ్మల్ని మర్చిపోతారు. అంటే మీకు డబ్బు వల్ల వచ్చిన కీర్తి, అందంవల్ల వచ్చిన కీర్తి, ఏదో మంచిపని చేయటం వల్ల వచ్చిన కీర్తి ఏదీ నిలబడదు. ఎందుకంటే, అది నిజం కాదు కాబట్టి. ఊరికే అది నిజంవలే మనకు కనిపిస్తుంది.

బుద్ధుడు రూపానికి నామానికి అసలు ప్రాముఖ్యత ఇవ్వడు. నా రూపం గొడవ మీకెందుకు నా నామం గొడవ మీకెందుకు! బుద్ధుడు ఎక్కడ పుట్టాడు, ఎక్కడ చనిపోయాడు, ఎంతకాలం బ్రతికాడు, కులం ఏమిటి, ఈ అక్కరలేని విషయాలు మీరు మరిచిపోండి. నా హృదయంలో ఏముందో మీరు చూడండి. నేను మీకు ఏదైనా మాట చెపుతూవుంటే ఏ ప్రేరణ వల్ల నేను మీకు ఆ మాట చెపుతున్నాను. అక్కడేదైనా స్వార్థం పెట్టుకొని చెపుతున్నానా, లేకపోతే నిస్వార్థంగా చెపుతున్నానా. నా హృదయంలో ఏదివుందో అది చూడండి. నేను ఏది చెపుతున్నానో అది అర్థం చేసుకొని ఆచరించండి అన్నాడు. ఆయన రూపనామాలకి విలువ ఇవ్వలేదు. మీకు దుఃఖాన్ని దూరం చేసి, మిమ్మల్ని నిర్వాణ సుఖానికి, మోక్షసుఖానికి తీసుకెళ్లటానికి ఆయన ప్రయత్నం చేసారు.

అందుచేత మహాత్ములను కానీ, మహర్షులను కానీ, యోగులను కానీ, పుణ్యాత్ములను కానీ, సత్పురుషులను కానీ, సహృదయం ఉన్నవాళ్లను కానీ మనం దర్శించటం వల్ల, ఆ దర్శనం ఊరికే పోదు. ఏదో ఒక లాభం మనకి వచ్చి తీరుతుంది. ఆ దర్శనభాగ్యం వల్ల మనలో మార్పు వస్తుంది.



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

రమణమహర్షి గారికి మానవ రూపంలో గురువు ఎవరూ లేరు. అరుణాచలేశ్వరుడే గురువు, అంటే ఒక మనిషిని గురువుగా తీసుకోకూడదని కాదు, ఆ ప్రారబ్ధం అటువంటిది,. ఆయనకి ఒక మానవుడు గురువుగా లేరు కాబట్టి అరుణాచలేశ్వరుడినే గురువుగా భావించి ఈ అక్షరమణమాల చెప్పారు.

**కుట్రమంతయు గోసి గుణముగ పాలించు**

**గురురూపమై వెలుగు అరుణాచలా ।19।**

**తాత్పర్యము :** మనస్సులోని మాలిన్యమునంతా కడిగి, సద్గుణములతో అలంకరించు. సద్గురు రూపమున నీవే వచ్చి, నాకు దారిచూపించు అరుణాచలా!

ఏవైనా సూక్ష్మ జీవులు వచ్చి శరీరంలో ప్రవేశిస్తే మనలో అనారోగ్యం ప్రారంభమవుతుంది. అలాగే దేహవాసన కానీ, లోకవాసన కానీ, శాస్త్రవాసన కానీ, నీ మనస్సులో ప్రవేశిస్తే మనస్సు పొల్యూట్ అవ్వటం ప్రారంభిస్తుంది. మనస్సులో అసూయ, ద్వేషం, వైరం, ఆత్మస్తుతి, ఇటువంటివేమైనా పాడుగుణాలు ఉంటే, ఆ దుర్గుణాలని నాయంతట నేను తీసుకోలేను. ఓ అరుణాచలేశ్వరుడా నీ అనుగ్రహం లేకుండా నాలో ఉన్న చెడ్డ అలవాట్లలోంచి విడుదల పొందలేను. నా యంతట నేను ఏదో ప్రయత్నం చేస్తాను. కానీ ఆ చెడ్డఅలవాట్లు అనే దుంగలు, నా యంతట నేను తీసుకోలేను. నీ దయ ఉంటేనే కానీ అందులోంచి విడుదల పొందలేను.

చైతన్యములో మంచిగుణాలు లేవు, చెడ్డగుణాలు లేవు. ఈ మంచి చెడ్డలు నీ మనస్సులోనే ఉన్నాయి. చైతన్యస్థితి గుణాలు లేని స్థితి. అయితే చెడ్డగుణాల వల్ల నువ్వు చైతన్యస్థితిని పట్టుకోలేవు. మంచిగుణాలను కల్టివేట్ చేయటం వల్ల, నీకులోపల ఉన్న ఆ

తత్త్వం ఎరుకలోకి వస్తుంది. చెడు అలవాట్లు ఉండకూడదు మంచి అలవాట్లు ఉండాలి అని ఎందుకు చెపుతున్నారు అంటే, మంచి అలవాట్లు, మీలో ఉన్న చైతన్యం తాలూకు ఎరుకని తీసుకొస్తాయి. రాముడిలో చాలా కళ్యాణ గుణాలు ఉన్నాయి. రాముడిలో ఉన్న కళ్యాణ గుణాల్ని మనల్ని ప్రాక్టీస్ చేయమంటున్నారు. దానివల్ల లోపల ఉన్న సత్యవస్తువుని చావులేని వస్తువుని పట్టుకోవటం తేలిక అవుతుంది.

మన ప్రవర్తన ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి అనుకూలంగా ఉండాలి. మామూలుగా మనం మనస్సులో ఒకటి అనుకుంటాం, నోటితోటి ఒకటి మాట్లాడతాము, చేతితోటి ఇంకో పని చేస్తాము. వాళ్ళు మట్టుకు ఈశ్వరానుగ్రహానికి పాత్రులు అవ్వరు. నువ్వు జపం చేసినా, ధ్యానం చేసినా ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవు అవ్వాలి. నీ ఆలోచన, నీ మాట, నీ చేత, ఇవి మూడూ నిదానంగా సమన్వయంగా ఉండాలి. సమన్వయంగా ఉంటేనే ఈశ్వరుడి దయకి నువ్వు పాత్రుడవు అవుతావు. నువ్వు మాట్లాడే మాట, నీ మనస్సులోకి వచ్చే తలంపులు, నువ్వు చేసే పనులు, ఈశ్వరుని అనుగ్రహానికి ఈశ్వరుని దయకి అనుగుణంగా ఉండాలి. లోకానికి అనుగుణంగా కాదు.

మనం లోకాన్ని పరిశీలించి చూస్తే చాలామంది మంచిపనులు చేసేవాళ్లు, గౌరవం కోసమో, గొప్పల కోసమో, కీర్తి కోసమో చేస్తారు. మిల్టన్ 'పారడైస్ లాస్ట్' అనే గ్రంధంలో సాధన చేసి మనం కామక్రోధాలను పోగొట్టుకోవచ్చు, కానీ కీర్తికాంక్ష పోగొట్టు కోవటం చాలా కష్టం అని రాశాడు. కీర్తికాంక్ష ఉన్నా నీకు మనస్సుకి లోచూపు కలగదు సరికదా నీకు లోకవాసన పెరుగుతుంది. మనిషికి ఆత్మజ్ఞానం కలగకపోవటానికి మూడే శత్రువులు, ఒకటి దేహవాసన, రెండు లోకవాసన, మూడు శాస్త్రవాసన. మనం లోకానికి, దేహానికి, శాస్త్రానికి దగ్గరగా ఉంటున్నాము, భగవంతుడికి, మన స్వరూపానికి మనం దూరంగా ఉంటున్నాము. మనకి ఆత్మజ్ఞానం కలగకపోవటానికి కారణం ఇదే. మనం పెద్ద పెద్ద సాధనలు చేయకపోయినా ముందు మనం డే-టు-డే లైఫ్ లో జాగ్రత్తగా ఉండవలసింది ఏమిటంటే, మైండ్ పొల్యూట్ అవ్వకుండా చూసుకోవాలి.

కుట్ర అంతయుగోసి -అంటే నాలో ఉన్న చెడ్డగుణాలను తొలగించి నిన్ను నేను

తెలుసుకునే యోగ్యత ముందునాకు పట్టించు. సామెత ఒకటి ఉంది, నీకు ఎంత యోగ్యత ఉంటే ఎంత అర్హత ఉంటే, అంతవరకే నువ్వు పొందుతావు కానీ, నీ అర్హతకు మించి, యోగ్యతకు మించి ఏదీ రాదు. గంగానదిలో ఎన్ని నీళ్ళు ఉన్నా మనం చెంబు పట్టుకెళ్తే చెంబుడు నీళ్లే వస్తాయి కానీ బిందెడు నీళ్ళు రావు. అందుచేత జ్ఞానం అంతటా వ్యాపించి ఉన్నప్పటికీ నీ యోగ్యతని బట్టి అది కలుగుతుంది. అది అంతటా ఉంది, ఎప్పుడో వచ్చేది కాదు, ఇప్పుడు కూడా ఉంది. ఆత్మజ్ఞానం తప్పనిసరిగా నీకు కలుగుతుంది. ఆ యోగ్యత రావటానికి, మన మనస్సు, మన ప్రవర్తన,భగవదనుగ్రహానికి అనుకూలంగా ఉండాలి. భగవదనుగ్రహం లేకుండా భగవదనుభవం కలగదు. అది సూత్రం.

పరమాచార్య గుంటూరులో ఒక మీటింగులో చెప్పారు, ఒక పెద్ద వృక్షాన్ని నువ్వు మోయటం చాలా కష్టం, అదే గోదావరి నదికి వరద వచ్చింది అనుకోండి, ఆ ప్రవాహంలో అది ఎంత బరువైనది అయినా కొట్టుకువచ్చేస్తుంది. అలాగే నీలో బలహీనతలు ఉంటే, నీ తెలివితేటల వల్ల వాటిని పోగొట్టుకోలేవు. నదీప్రవాహంలో వృక్షం ఎలా కొట్టుకుపోతుందో అలాగే ఈశ్వరుని దయ కనుక నీకు ఉంటే, ఆ దయకి కనుక నువ్వు డిజర్వ్ అయితే, నీలో ఉన్న వాసనలు, బలహీనతలు ఎంత బరువైనవి అయినప్పటికీ ఈశ్వరుని యొక్క అనుగ్రహ ప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి.



**గురువు అంటే వ్యక్తి కాదు, గురువు దేహరహితుడు,గురువు లోకరహితుడు, గురువు మనోరహితుడు. శరీరంలో ఉన్నా శరీరమాత్రుడు కాదు.**

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# వ్యాసం వందే జగద్గురుం

మన భారతీయ సంస్కృతిలో గురువుది ఒక ప్రత్యేక స్థానం. భగవదవతారాలైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు కూడా గురువును ఆశ్రయించి బ్రహ్మజ్ఞానాన్ని పొందినవారే!

అందుకే యోగి వేమన

**విత్తనంబు గురువు విశ్వంబునకు నెల్ల**

**ప్రణవమంత్ర మొకటి పరమ గురువు॥**

అని గురువు యొక్క ఔన్నత్యాన్ని తెలియజేసారు. జగత్తుకి మూలకారణము అనగా విత్తనము గురువు. అట్లే 'ఓం'కారమును పరమగురువని పేర్కొన్నారు. గురువు త్రిమూర్తి స్వరూపుడు. మన సనాతన సంప్రదాయంలో గురుపరంపరలో ఆద్యుడు, జ్ఞాననిధి అయిన భగవాన్ వ్యాసమహర్షి జన్మదినమైన ఆషాఢ పూర్ణిమను గురుపూర్ణిమగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వ్యాసుడి అసలు పేరు కృష్ణద్వైపాయనుడు. ఆయన తండ్రి పేరు పరాశర మహర్షి. వేదరాశిని విభజించి వేదవ్యాసుడయ్యాడు. గురువు అంటే శిష్యునిలోని నిగూఢమైన చైతన్య శక్తిలోకి మేల్కొలిపి జ్ఞానజ్యోతిని వెలిగించే దైవస్వరూపుడు అని అర్థం. పవిత్రమైన గంగానదిలా గురువు తనను ఆశ్రయించిన వారి కల్మషాలను కడిగి స్వస్థితిలోకి మేల్కొలుపుతాడు. మన సనాతన సంప్రదాయంలో గురుశిష్య సంబంధం పరమ పవిత్రమైనదిగా భావిస్తారు. గురువు కాలాతీతుడు కానీ వ్యవహారంలో కాలానికి కట్టుబడి ఉంటాడు. మన అలవాట్లు, వాసనలు, దేహబుద్ధి కారణంగా గురువు చెప్పినది అసత్యం అనిపిస్తుంది. మనకు శాస్త్రపరిచయం లేకపోవచ్చు కానీ సకల శాస్త్రసారం గురువే అన్న జ్ఞానం మనకి ఉంటే గురువాక్యం వేదవాక్యం అవుతుంది. ఆషాఢ పూర్ణిమ రోజున గురుపూజ చేయడంలోని ఆంతర్యం మన గురువును వేదవ్యాసుని రూపంగా భావించి పూజించడమే! గురువు సర్వదేవమయుడు. గురువు తన స్పర్శ, వాక్కు, ప్రేమ, సంకల్పము, చేత మనల్ని పునీతుల్ని చేస్తారు. బ్రహ్మజ్ఞుడు, బ్రహ్మవిదుడు అయిన గురువు లేకుండా ఆధ్యాత్మిక వికాసం రాదు. గురువే భగవంతుడు. గురువే చైతన్యం. గురువే అనుగ్రహం. శ్రీమహావిష్ణువే వేదవ్యాసునిగా అవతరించాడని చెబుతారు, అందుకే ఆయన వ్యాస భగవానుడు అయ్యాడు. దక్షిణామూర్తి స్వరూపమైన గురుసన్నిధితో సరితూగేది ఈ సృష్టిలో ఏదీ లేనే లేదు. వేద విజ్ఞానమంతా వ్యాసునిగా మూర్తీభవించింది. మానవాళికి ఆయన చేసిన సేవ నిరుపమానం. అందువల్లే వ్యాసుడు పరమపూజనీయుడు.

**(ది॥ 13-07-2022 గురుపూర్ణిమ సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# బాధ - బాధాయుతం

వేదం అంటోంది "పాపాత్మ పాపసంభవః". మనం ఎదుటివాడిని ఉద్దేశించి వాడు నాకు గతంలో ఎంతో ద్రోహం చేసాడని అతనిని చూపుడువేలుతో చూపిస్తూ ఉంటే అతని అరచేతిలో ఉన్న మూడువేళ్ళు "నీవు గత జన్మలో చేసిన పాపాల వల్లనే" అని అతనికి సూచిస్తాయి. కారణం లేకుండా కార్యం ఉండదు. హేతువు లేకుండా తీతువు పిట్ట మోగదు, శివుని ఆజ్ఞ లేకుండా చీమైనా కుట్టదు. అదే నానుడిని మనం పరిపూర్ణంగా విశ్వసించాలి. ఇంకా చెప్పాలంటే "నారాయణం పరబ్రహ్మం సర్వకారణ కారణం" అంటోంది వేదం. దానినే మనం నిస్సందేహంగా నమ్మాలి. మనం సినీతెరపై ఆడే బొమ్మలం. నటులకు స్వతంత్రం లేదు. డైరెక్టరు ఏమి మాట్లాడమంటే అదే పలుకుతాడు. ఎక్కడ ఏ గంతు వెయ్యాలో అక్కడ ఆ గంతులు వెయ్యాలి. ఎక్కడ ఏ పాట పాడాలో అక్కడ ఆ పాట పాడాలి. సినిమా పూర్తి అయిన తరువాత అన్ని బొమ్మలను తీసేస్తాడు డైరెక్టరు. ఇక్కడ డైరెక్టరు ఎవరంటే నారాయణుడే. అలాగే మానవ జీవితం చదరంగంలో పెద్ద నిచ్చెనలు, చిన్న నిచ్చెనలు ఉంటాయి; పెద్ద పాములు, చిన్న పాములు ఉంటాయి. వీటిని అన్నింటిని అధిగమించి వైకుంఠానికి చేరుకొన్నవారు బహుకొద్దిమంది ఉంటారు. అలాగే సద్గురువు పర్యవేక్షణో శిక్షణ పొందినవారు ఆయన ఎన్నుకున్నవారు మాత్రమే సత్యానుభవం పొందుతారు. మన అనుబంధాలు ఆత్మీయత అనేవి ఒట్టి వింతనాటకం. అది సంసార బాధలు అనుభవించాక తెలుస్తుంది. గతంలో చేసిన పాపపుణ్యాలను ఈశ్వరుడు మీకు రుచి చూపిస్తాడు. అక్కడ మనకు స్వతంత్రం లేదు. "భగవదాను సారమే కర్మఫలం లభించును. ఈశ్వరుడే కర్మల యొక్క శుభాశుభములు ఇచ్చుట జగన్నియామకుడైఉన్నాడు" భగవాన్ ఉవాచ. శ్రీనాన్నగారు "ఈ భావన అర్థమైతే దుఃఖం ఒక్క క్షణంలో పటాపంచలమౌతుంది" అన్నారు. గురువు చేతుల్లో ఒక పనిముట్టుగా మారాలి. దానినే "గురువే సాధన, గురువే సాధ్యం" అంటారు పెద్దలు. బాదలు అనేవి సత్యదర్శనానికి నిచ్చెనమెట్లు. అవి ఆ దుఃఖాలే దేవునిలో ఐక్యం కావటానికి సహకరిస్తాయి. మానవునికి 'దుఃఖం' అనేది లేకపోతే దేవుని మాటే ఎత్తే అవకాశం కలగదు. ముద్దుచే బిడ్డలు, స్థిరమైన సంపద, పరిచారకులు ఆప్యాయతలతో తల్లితండ్రులకు సేవచేసే సంతానం ఉంటే అసలు భగవంతుడే గుర్తుకురాడు. దుఃఖాల కొలిమిలో కాల్చబడ్డవారే శుద్ధిచేసిన మేలిమి బంగారంలా తయారవుతారు. దుఃఖాలు మనకు పాఠాలు నేర్పుతాయి. మనకు భగవంతుడు సమకూర్చిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. అవి శుభాలు అయితే మంచి పనులకు వినియోగించుకోవాలి. శంకర భగవత్పాదులు రచించిన 'భజగోవిందం' బాగా అధ్యయనం చేసి, ఆకళింపు చేసుకుంటే జీవితం సఫలమైనట్లే. చివరిగా వారు గురుపాదపంచకంపై దృష్టిని పెట్టకపోతే ఎంత సంపద ఉన్నా, ఎంత అధికారం ఉన్నా ఏమి ఉన్నా ఏమిటి ప్రయోజనం అని ముమ్మారు పలికారు. జీవితం అంతా చీకటిమయం అయినా దానిని సంతోషంగా అనుభవిస్తే తదుపరి సూర్యోదయం కలిగి ఉదయ భాస్కరుడు తారసపడతాడు. ఇది సత్యం... సత్యం... సత్యం.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**